


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 21-05-2022 సంపుటి: 03 సంచిక: 243 పేజీలు: 4 వెల: రూ 3-00


# జగన్ ముద్దులు చూసి ప్రజలు మోసపోయారు

అనంత పార్టీ భేటీలో చంద్రబాబు నాయుడు



అనంతపురం ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యకర్తల సమావేశంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. వేలాది గా తరలివచ్చిన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాం నుంచి అనంతపురం జిల్లా టిడిపికి కంచుకోట. 2014లో 14 సీట్లకు గాను 12 సీట్లు గెలిపించిన జిల్లా అనంతపురం. రాష్ట్రంలో ప్రభుత్వ బాదుడు భయంకరంగా ఉంది. కార్యకర్తలకు ఒక్క అడుగు వేస్తే...ప్రజలు పది అడుగులు వేస్తున్నారు. ప్రజల్లో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత చూసి క్యాడర్ కు కిక్కు ఎక్కింది. అనంతపురానికి కియా పరిశ్రమ వస్తుంది అని ఎవరైనా ఊహించారా? 30 వేల మందికి ఉపాధి కియా ద్వారా వస్తుంది. ఈ మూడేళ్లలో ఒక్క పరిశ్రమ వచ్చిందా....? జిల్లాలో జాకీ పరిశ్రమ వైసిపి రౌడీ ఇజానికి భయపడి పారిపోయింది. జగన్ ముద్దులు చూసి అనంత ప్రజలు కూడా మోస పోయారు. ఇప్పుడు జగన్ పాలన అంతా బాదుడు..గుద్దుడు. సొంత జేబులు నింపుకోవడానికి జగన్ జె బ్రాండ్స్ మద్యం తీసుకు వచ్చారు. జగన్ చెప్పిన సుబ్రహ్మణ్యం అన్న....సవాంగ్ అన్న ఏమయ్యారు? ప్రధాన కార్యదర్శిగా ఉన్న సుబ్రహ్మణ్యం ను చివరికి కుర్చీలేని పోస్టుకు పంపారు. మనపై కేసులు పెట్టి వేధించిన డిజిపి సవాంగ్ చివరికి ఏమయ్యారు. అనంతకు మూడేళ్లలో ఏం చేశారో చర్చకు సిద్దమా అని ప్రశ్నించారు. కర్నూలులో సోలార్ ప్రాజెక్టుపై విమర్శలు చేసి...సిగ్గు లేకుండా ఇప్పుడు ప్రారంభించారు. ఎప్పుడు ఎన్నికలు జరిగిని అనంత ప్రజలు చిత్తు చిత్తుగా ఓడించాలి. గంజాయికి అలవాటు పడి యువత పక్కదోవ పడుతుంది. దద్దమ్మ సిఎం గంజాయి సరఫరాను అరికట్టకపోవడం వల్లనే ఇప్పుడు ఇన్ని అనర్థాలని అన్నారు. ఇప్పుడు జరిగిన భూ కబ్జాలపై అధికారంలోకి వచ్చిన తరువాత విచారణ చేసి చర్యలుంటాయని అన్నారు.

# రాబోయే 25 ఏళ్లు బీజేపీవే.. మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు!



ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ విజయాలను అందుకుంది. యూపీతో సహా నాలుగు రాష్ట్రాల్లో అధికారాన్ని మరోసారి కైవసం చేసుకుంది. ఈ తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే 25 ఏళ్ల పాటు అధికారంలో ఉండేందుకు ప్రణాళికలు రచించుకోవాలని పార్టీ నేతలకు సూచించారు.అయితే, రాజస్థాన్? రాజధాని జైపూర్‌లో జరుగుతున్న బీజేపీ జాతీయ పదాధికారుల సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఆయన ఈ కార్యక్రమానికి ప్రధాని వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. దేశాభివృద్ధిని అడ్డుకునేందుకు విష ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే కుటుంబ పార్టీలపై నిరంతరం పోరాటం చేయాలని సూచించారు. దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. అలాగే, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా కార్యక్రమాన్ని రూపొందించాలని కోరారు. ఈ క్రమంలోనే దేశంలో కొన్ని రాజకీయ పార్టీలు అధికారం కోసం, తమ స్వార్థ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం, భారత్?కు ఉన్న సవాళ్లను అధిగమించేందుకు బీజేపీ ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంతో రాబోయే 25 ఏళ్లకు లక్ష్యాలను నిర్దేశించాల్సిన ఆవశ్యకత బీజేపీపై ఉందన్నారు. వాటి కోసం నిరంతరం శ్రమించాల్సిన సమయం బీజేపీకి ఇదేనని పేర్కొన్నారు. దీంతో వచ్చే 25 ఏళ్లపాటు తామే అధికారంలో ఉండాలని భావిస్తున్నట్టు మోదీ పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సహా, పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## గుడివాడ గడ్డని టీడీపీ అడ్డాగా మారుస్తాం: దివ్యవాణి

అమరావతి : గుడివాడ గడ్డని టీడీపీ అడ్డాగా మారుస్తామని టీడీపీ నాయకురాలు దివ్యవాణి పేర్కొన్నారు. గుడివాడ అంటే అన్న ఎన్టీఆర్ పేరు గుర్తుకు వచ్చేదని.. నేడు దానిని క్యాసినోవాడగా మాజీ మంత్రి కొడాలి నాని మార్చాడన్నారు. రాజకీయం కోసం, పదవుల కోసం బూతులు మాట్లాడితే, పంచలు ఊడదీసి కొడతామన్నారు. క్యాసినో నాని ముందు గుడివాడలో రోడ్లు అభివృద్ధి చెయ్యాలని దివ్యవాణి సూచించారు.



## తెలుగువారి తెగువకు నిలువెత్తు నిదర్శనం టంగుటూరి: సీఎం జగన్

అమరావతి: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి నేడు(మే 20). ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు నివాళులు అర్పించారు. 'తెలుగువారి తెగువకు నిలువెత్తు నిదర్శనం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రజల మనసులో చిరస్మరణీయంగా నిలిచిన ఆ మహనీయుని వర్ధంతి సందర్భంగా ఘన నివాళి. ఆయన త్యాగం, సాహసం భావితరాలకు ఆదర్శం' అని సీఎం జగన్ ట్వీట్ చేశారు.



## జ్ఞానవాపి మసీదు పిటిషన్

## వీడిన సస్పెన్స్.. సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ: జ్ఞాన్‌వాపి మసీదు వీడియోగ్రాఫి సర్వే అభ్యంతర పిటిషన్‌పై సుప్రీం కోర్టులో శుక్రవారం విచారణ వాడివేడీగా సాగింది. ఈ తరుణంలో కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇస్తుందో అనే సస్పెన్స్ వీడింది. జిల్లా కోర్టులోనే విచారణకు మొగ్గు చూపిన సుప్రీం త్రిసభ్య ధర్మాసనం.. ఇదొక సంక్లిష్టమైన, సున్నితమైన అంశమని పేర్కొంది. జిల్లా కోర్టు నిర్ణయం, విచారణపై స్టే విధించాలంటూ పిటిషనర్(అంజుమాన్ ఇంతెజమియా మసీద్ కమిటీ) తరపు న్యాయవాది బెంచ్‌ను కోరారు. అయితే ఈ కేసు పరిణామాలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని, జోక్యం చేసుకోబోమని బెంచ్.. జ్ఞానవాపి మసీదు కాంప్లెక్స్ శివలింగాన్ని సంరక్షించడంతో పాటు నమాజ్ కొనసాగించుకోవచ్చన్న మధ్యంతర ఆదేశాలు మాత్రం కొనసాగుతాయని తెలిపింది. అంతేకాదు.. ట్రయల్ జడ్జి కంటే అనుభవం ఉన్న జిల్లా జడ్జి సమక్షంలోనే వాదనలు జరగడం మంచిదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ మేరకు పిటిషన్‌ను వారణాసి జిల్లా కోర్టుకు బదిలీ చేస్తున్నట్లు ప్రకటించింది.మరోవైపు అడ్వొకేట్ కమిషన్ రూపొందించిన రిపోర్ట్.. బయటకు పొక్కడంపై సుప్రీం కోర్టు సీరియస్ అయ్యింది. ప్రత్యేకించి కొన్ని లీకులు మీడియాకు చేరుతున్నాయి. అది కోర్టుకు సమర్పించే అంశం. కోర్టులో జడ్జే కదా దానిని తెరవాల్సింది అని జస్టిస్ డీవై చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. కమ్యూనిటీల మధ్య సౌభ్రాతృత్వం కోసం, శాంతి అవసరం నెలకొల్పాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. దీంతో.. మే 23న వారణాసి కోర్టు మసీద్ సర్వే పిటిషన్‌పై వాదనలు వినేందుకు మార్గం సుగమమైంది. ఇదిలా ఉంటే.. జ్ఞానవాపి మసీద్ సర్వేపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అంజుమాన్ ఇంతెజమియా మసీద్ కమిటీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. అదే సమయంలో.. జ్ఞానవాపి? శ్రింగార్ గౌరీ కాంప్లెక్సులో వారణాసి కోర్టు నియమించిన అడ్వొకేట్ కమిషన్ సర్వే పూర్తి చేసి నివేదికను సీల్డ్ కవర్‌లో.. కోర్టుకే సమర్పించింది. అయితే ఈ వ్యవహారంలో తమ నుంచి తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఎలాంటి విచారణ చేపట్టొద్దని వారణాసి కోర్టును గురువారం ఆదేశించింది సుప్రీం కోర్టు. దీంతో కమిటీ సమర్పించిన సీల్డ్ కవర్ తీసుకోవడం వరకు మాత్రమే పరిమితం అయ్యింది వారణాసి కోర్టు. ఆపై మే 23వ తేదీకి తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈ తరుణంలో ఇప్పుడు సుప్రీం కోర్టు బెంచ్ ఆదేశాలు వారాణాసి కోర్టు ముందుకు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు కమిటీ రూపొందించిన రిపోర్ట్‌లోని వివరాలు బయటకు పొక్కడం కలకలం రేపుతోంది.



## ప్రముఖ నటుడు కన్నుమూత

ప్రముఖ నటుడు కెప్టెన్ చలపతి చౌదరి (67) గురువారం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కర్ణాటకలోని రాయ్‌చూర్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త విన్న పలువురు సెలబ్రిటీలు చలపతి చౌదరికి నివాళులు అర్పిస్తున్నారు. కాగా విజయవాడకు చెందిన చౌదరి రాయ్‌చూర్‌లో స్థిరపడ్డారు.తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో కలిపి వందకు పైగా సినిమాల్లో నటించారు. చిరంజీవి, శివరాజ్ కుమార్, బాలకృష్ణ వంటి పలు స్టార్ హీరోల సినిమాల్లో ముఖ్య పాత్రలు పోషించారు. అలాగే బుల్లితెరపై ప్రసారమయ్యే పలు సీరియల్స్‌లోనూ కనిపించారు. ఇటీవల ఆయన నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన అఖండ చిత్రంలోనూ కనిపించి మెప్పించారు.



## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం..

### 9 మంది సజీవదహనం

ముంబై: మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది సజీవదహనమయ్యారు. గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో చంద్రాపూర్-ముల్ రోడ్డుపై అజయ్‌పూర్ సమీపంలో డీజిల్ ట్యాంకర్, మొద్దుల లోడుతో వెళ్తున్న ట్రక్కు ఢీకొన్నాయి. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో తొమ్మిది మంది దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల్లో లారీ డ్రైవర్‌తోపాటు కూలీలు ఉన్నారని చంద్రాపూర్ ఎస్డీపీవో సుధీర్ నందన్‌వార్ చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.కాగా, ప్రమాదం జరిగిన గంట తర్వాత అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకున్నారని సమాచారం. కొన్ని గంటలపాటు శ్రమించిన తర్వాత మంటలను అదుపుచేసినట్లు అధికారులు వెల్లడించారు. మృతదేహాలను చంద్రాపూర్ జిల్లా దవాఖానకు తరలించామని తెలిపారు.



## వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబును అరెస్టు చేయాలి : లోకేశ్



అమరావతి : కాకినాడ ఎమ్మెల్సీ అనంత బాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యహత్య ఘటనలో ఎమ్మెల్సీని వెంటనే అరెస్టు చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ ఘటనపై సీబీఐ విచారణ చేపట్టాలని ఆయన ట్విటర్‌లో కోరారు. సుబ్రహ్మణ్యంను రాత్రి కారులో తీసుకెళ్లిన ఎమ్మెల్సీ కారణం చెప్పకుండా మృతదేహాన్ని తీసుకొచ్చి తల్లిదండ్రులకు, భార్యకు అప్పగించి వెళ్లడం అనుమానాలకు దారితీస్తుందని పేర్కొన్నారు.హత్యను ప్రమాద ఘటనగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం దారుణమని ఆయన అన్నారు. ఎమ్మెల్సీ అనంత బాబుని పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. ఏపీ బీహార్ కంటే దారుణంగా మారిందని ఆరోపించారు. వైకాపా ప్రజాప్రతినిధులు, నాయకులకు హత్యలు, అరాచకాలు చేసుకోమని స్పెషల్ లైసెన్స్ ఏమైనా ప్రభుత్వం ఇచ్చిందా? అని లోకేశ్ ప్రశ్నించారు. ఎంతో భవిష్యత్ ఉన్న కుమారుడ్ని కోల్పోయిన తల్లిదండ్రులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## చంద్రబాబు ఎప్పటికీ సీఎం కాలేరు: మంత్రి అంబటి

తాడేపల్లి: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై ఏపీ జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. "చంద్రబాబు జిమిక్కులను ప్రజలు నమ్మే స్థితిలో లేరు. అధికారం కోసం ఎంతకైనా దిగజారిపోయే వ్యక్తి చంద్రబాబు. బీసీలకు రాజ్యసభ సీటు ఇస్తే చంద్రబాబు రాద్ధాంతం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించే సత్తా చంద్రబాబు, పవన్‌కు లేవు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా విజయం మాత్రం వైఎస్సార్‌సీపీదే. చంద్రబాబు ఎప్పటికే మాజీ ముఖ్యమంత్రే తప్ప మళ్లీ సీఎం కాలేరు. రాయలసీమకు చంద్రబాబు చేసింది ఏమిటి" అని ప్రశ్నించారు.



# సంపాదకీయం

శనివారం 21-05-2022

## డబుల్ ఇంజన్ వాస్తవాలు- అపోహలు

బీజేపీ ఈ మధ్య 'డబుల్ ఇంజిన్' పాట పాడుతున్నది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీయే రాష్ట్రంలోనూ ఉంటే అభివృద్ధికి ఢోకా ఉండదని పిలుపునిస్తున్నది. ఇటీవల ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో ఈ నినాదాన్ని బలంగా ప్రజలలోకి తీసుకెళ్లింది. అంతకుముందు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలోనూ వినిపించింది. తాజాగా తెలంగాణలో దీన్ని తెరపైకి తెచ్చింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటనలో 'డబుల్ డెక్కర్' ప్రస్తావనతో బీజేపీని ఆదరించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంలో 'డబుల్ ఇంజిన్' ప్రస్తావన ఎక్కడా లేకపోయినా ఓటర్ల మైండ్‌ను సెట్ చేస్తున్నది. ప్రలోభాలకు గురి చేస్తున్నది. రాష్ట్రాల సమూహమే యూనియన్ (రిపబ్లిక్) అనే మౌలిక సూత్రానికి భిన్నంగా ఈ నినాదాన్ని జనంలోకి తీసుకెళ్తున్నది. నిజానికి కేంద్రానికి, రాష్ట్రాలకూ మధ్య సంబంధాలు, పరస్పర సహకారానికి రాజ్యాంగంలో స్పష్టమైన విధానమే ఉన్నది. అధికార పార్టీల ఇష్టాయిష్టాలతో సంబంధం లేదు. బీజేపీ 'డబుల్ ఇంజిన్' నినాదం కేంద్రం దయ తలచి సాయం చేస్తే పుచ్చుకోవడమే తప్ప రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధమైన, చట్టపరమైన హక్కులు లేవని హెచ్చరించే ధోరణే. 'మీ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా.. కేంద్రం నుంచి నిధులు రావాలన్నా, సంపూర్ణ సహకారం అందాలన్నా మా పార్టీనే గెలిపించండి. లేకుంటే కష్టమే' అని ప్రజలను బ్లాక్ మెయిల్ చేయడమే. భవిష్యత్తులో స్థానిక సంస్థలపైనా కన్నేసి 'ట్రిపుల్ ఇంజిన్' అనే స్లోగన్ అందుకున్నా ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. పార్లమెంటు ఎన్నికలు పూర్తయ్యి పవర్‌లోకి వచ్చిన తర్వాత జరిగిన అనేక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈ వైఖరిని ప్రదర్శించింది. 'డబుల్ ఇంజిన్' అనే పదాన్ని వాడకపోయినా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకే రాష్ట్రంలోనూ పవర్‌ను కట్టబెట్టండి అని పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటర్లకు పిలుపునిచ్చింది. కొన్నిచోట్ల వర్కవుట్ అయిందిగానీ, అన్నిచోట్లా ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. పంజాబ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలలో బెడిసికొట్టింది. పసలేని నినాదంగానే రుజువైంది. ఇప్పుడు తెలంగాణలోనూ ఈ నినాదాన్ని వినిపిస్తున్నది. కేంద్రానికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికీ సంబంధాలు బెడిసికొట్టిన ప్రభావాన్ని చూస్తున్నాం. వడ్ల కొనుగోళ్ళ అంశం మొదలు రిజర్వు బ్యాంకు అప్పులకు అనుమతి వరకు అది స్పష్టంగా కనిపిస్తున్నది. 'రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదువా' తరహాలో కేంద్రంలో అధికారాన్ని తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వాడుకుంటున్నది. ఇది ఇక్కడితోనే ఆగుతుందని భావించలేం. భవిష్యత్తులో మరింత ఘర్షణకు, రాజకీయ విద్వేషానికి దారితీసే ప్రమాదం లేకపోలేదు. 'మేం ఇచ్చేవారం, మీరు పుచ్చుకునేవారు' తరహాలో తలొగ్గి ఉండాలంటూ పరోక్షంగా సంకేతమివ్వడమే. దీంతో రణమో, శరణతో తేల్చుకోవడం తెలంగాణ వంతయింది. బీజేపీ వల్లిస్తున్న 'డబుల్ ఇంజిన్' నినాదం శాస్త్రీయమే అయితే ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు ప్రగతిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా ఎందుకు లేవు? ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ఎందుకు అందడంలేదు? ఉత్తరప్రదేశ్ నుంచి ఉపాధిని వెతుక్కుంటూ తమిళనాడు, తెలంగాణ లాంటి రాష్ట్రాలకు పేద కార్మికులు ఎందుకు వలస వస్తున్నారు? తెలంగాణలో పనిచేస్తున్న లక్షలాది మంది ఇతర రాష్ట్రాల కార్మికులలో ఉత్తరప్రదేశ్‌కు చెందినవారే ఎక్కువ. గత ఐదేండ్లుగా కేంద్రంలో, ఆ రాష్ట్రంలో పవర్‌లో ఉన్నది బీజేపీయే. 'డబుల్ ఇంజిన్' అభివృద్ధి, సంక్షేమం నిజమే అయితే ఆ పేదలు ఉపాధిని వెతుక్కుంటూ ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఎందుకు ఏర్పడింది? 'డబుల్ ఇంజిన్' ఒక డొల్ల నినాదమే. బీజేపీ పాలిత రాష్ట్రాలను చూస్తే ఇది స్పష్టమవుతుంది. ఆ మాటకొస్తే అనేక అంశాలలో ఢిల్లీ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలో ప్రగతి బీజేపీ పాలిత రాష్ట్రాలకంటే మెరుగ్గా ఉన్నది. సంక్షేమ పథకాల అమలు, సబ్సిడీలు, విద్య, వైద్యం, విద్యుత్ లాంటివి ఇందుకు ఉదాహరణలు. ఉప్పుడు బియ్యం కోసం ఇతర రాష్ట్రాల మీద ఆధారపడిన తమిళనాడు ఇప్పుడు స్వయంసమృద్ధిని సాధించింది. గుజరాత్‌లో బీజేపీ ప్రభుత్వమే ఎనిమిదేండ్లుగా పవర్‌లో ఉన్నా విద్యుత్ సంక్షోభంతో పరిశ్రమలకు 'పవర్ హాలీ డే' ప్రకటించక తప్పలేదు. 'కర్ర ఉన్నోడిదే పెత్తనం' తరహాలో అధికార బలంతో హైదరాబాద్‌కు మంజూరైన ఆర్బిట్రేషన్ సెంటర్, ఆయుష్ రీసెర్చి సెంటర్‌లాంటివాటిని గుజరాత్‌కు పంపించేసింది. రాష్ట్రాల ఆకాంక్షలను నీరుగారుస్తూ ప్రగతికి ప్రతిబంధకాలు కల్పిస్తూ ప్రజలతో మైండ్ గేమ్ ఆడుతున్నది. కేంద్రంలోని బీజేపీ మాత్రమే కాదు. తెలంగాణలోని టీఆర్ఎస్ కూడా అదే భావజాలంతో ఉన్నది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీని గెలిపిస్తే నిధుల విడుదలకు ఢోకా ఉండదంటూ స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ప్రచారం చేశారు. ప్రజలలో అభద్రతా భావాన్ని క్రియేట్ చేశారు. 'మీ పల్లెలు, పట్టణాలు అభివృద్ధి చెందాలంటే, సౌకర్యాలు మెరుగుపడాలంటే ప్రతిపక్షాలతో సాధ్యం కాదు. రాష్ట్రంలో టీఆర్ఎస్ అధికారంలో ఉన్నది. ఆ పార్టీని గెలిపిస్తే నిధులు వరదలా వచ్చేస్తాయి. మీ గ్రామాలలో అభివృద్ధికి ఢోకా ఉండదు' అంటూ ప్రచారం చేశారు. రాష్ట్రం దయ తలిచి ఇస్తేనే నిధులు వస్తాయి. అభివృద్ధి జరుగుతుంది. లేదంటే కుదరదు అని ప్రజలను హెచ్చరించారు. అసెంబ్లీ వేదికగానే సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సహా పలువురు 'మా నియోజకవర్గాలకు నిధులు ఇవ్వడంలేదు. సమస్యలు తిష్ట వేశాయి. పరిష్కారానికి నోచుకోవడంలేదు" అంటూ మొరపెట్టుకున్నారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు వాదనా ఇదే. రాష్ట్రంలోని అధికార టీఆర్ఎస్ 'డబుల్ ఇంజన్' అనే పదాన్ని వాడకపోయినా అదే ధోరణిలో ప్రవర్తిస్తున్నది. స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆరే పలు సందర్భాలలో 'రాష్ట్ర అవసరాలకు, ప్రయోజనాలకు ఉపయోగపడుతుందని కేంద్రంతో సఖ్యతగా ఉంటున్నాం. అంశాలవారీగా మద్దతు ఇస్తున్నాం. ఘర్షణ పడితే నిధులు రావనే ఉద్దేశంతోనే స్నేహాన్ని కొనసాగిస్తున్నాం' అనే అర్థంలో వ్యాఖ్యానించారు. రాష్ట్రాల చట్టబద్ధమైన హక్కులు, సహకార సమాఖ్య స్ఫూర్తి, రాజ్యాంగం కల్పించిన అధికారాలు కేసీఆర్‌కు తెలియందేమీ కాదు. అయినా రాష్ట్ర, రాజకీయ ప్రయోజనాల కోసం రాజీ పడ్డారు. కేంద్రానికి, రాష్ట్రాలకు ఉండే అధికారాలపై స్పష్టమైన నిర్వచనమే ఇచ్చింది. అధికారం రుచి మరిగిన బీజేపీ తన స్థానాన్ని పదిలం, పటిష్టం చేసుకోడానికి తహతహలాడుతున్నది. రాష్ట్రాల బలహీనతలను సొమ్ము చేసుకుంటున్నది. కొన్ని పార్టీల నేతలు ఇటీవల 'రాష్ట్రాలను కేంద్రం మున్సిపాలిటీల స్థాయికి దిగజార్చింది..' అని వ్యాఖ్యానించడం గమనార్హం. రాష్ట్రాల వ్యాట్ హక్కులను హరిస్తూ 'వన్ నేషన్-వన్ టాక్స్' పేరుతో జీఎస్టీని తెచ్చింది.

## ఏపీలో ఏం జరుగుతోంది... చినజీయర్ కామెంట్స్ తో కలకలం



విజయవాడ, మే20, (న్యూస్ పల్స్)అంధ్రప్రదేశ్ లో పాలన అద్భుతంగా ఉందని వైసీపీ నేతలు అంటున్నారు.. 80 శాతానికిపై గా ప్రజలు తమ పాలనకు బ్రహ్మరథం పడుతున్నారంటూ సీఎం జగన్ సైతం అభిప్రాయంలో ఉన్నరని వైసీపీ వర్గాలు అంటున్నాయి. అయితే విపక్షాల మాత్రం.. గతంలో ఎన్నడూ లేనంతాగా ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందంటున్నాయి. గాలిలో వచ్చిన పార్టీ గాలిలోనే కొట్టుకుపోతుందని విమర్శలు చేస్తున్నారు విపక్ష నేతలు. ముఖ్యంగా రోడ్లు, ఇతర మౌలిక వసతులపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇటీవల తెలంగాణ మంత్రి కేటీఆర్ సైతం ఇదే వ్యాఖ్యలు చేశారు. ఏపీలో రోడ్లు దారుణంగా ఉన్నాయి అన్నారు. వెంటనే వైసీపీ మంత్రులు, నేతలు కేటీఆర్ పై విరుచుకుపడ్డారు.. బస్సులు వేసుకొని రండి.. ఏపీలో రోడ్లు ఎంత బాగున్నాయో చూపిస్తామంటూ సవాల్ విసిరారు. అయితే జగన్ ప్రభుత్వంతో ఉన్న సాన్నిహిత్యం నేపథ్యంలో..ఆ వ్యాఖ్యలపై వెనక్కు తగ్గినట్టు స్వయంగా మంత్రి కేటీఆర్ ప్రకటించారు. అయినా ఆ దుమారం కొనసాగుతోంది. తాజాగా ఏపీలోని రోడ్ల పరిస్థితిపై చిన జీయర్ స్వామి చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. నేరుగా విమర్శలు చేయకుండా.. ఏపీలో రోడ్ల దుస్థితిపై సెటైర్లు వేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు చిన్న జీయర్ స్వామి పర్యటించారు. ఈ సందర్భంగా ఏపీలో రోడ్ల పరిస్థితి పై చిన్న జీయర్ స్వామి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం నుంచి రాజమండ్రి ప్రయాణించేందుకు సుమారు 3 గంటలకుపై? సమయం పట్టిందన్నారు. ఒక్కో ప్రయాణంలో ఒడిదుడుకులు ఎదుర్కొన్నట్లు పేర్కొన్నారు. ప్రయాణంలో ఇటువంటి ఇబ్బంది ఏర్పడడానికి బహుశా? రోడ్ల మీద గోతులు ఎక్కువ ఉండ వచ్చంటూ చిన్న జీయర్ స్వామి సైటర్లు వేశారు. ఏపిఐఐసి మాజీ చైర్మన్ శ్రీఘూకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం ఆహ్వానంతో రాజమండ్రిలో చిన్న జీయర్ స్వామి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా ఏపి లో రోడ్ల దుస్థితి పై చిన్న జీయర్ స్వామి చేసిన హాట్ కామెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నారు. తాజగా స్వామి చేసిన వ్యాఖ్యలతో ప్రతిపక్షాలకు ఆయుధం దొరికినట్టేనా.. ఎందుకంటే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రోడ్లు అధ్వానంగా పరిస్థితులు ఉన్నాయని చాలాకాలంగా ప్రతిపక్ష పార్టీలు అధికార పార్టీని టార్గెట్ చేస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ గుంతల మయం అయిన రోడ్లపై వినూత్నమైన నిరసన తెలియజేసి, రోడ్లను తక్షణం మరమ్మతు చేయాలని వైసీపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అయినా నేటికీ ఏపీలో రోడ్లు దారుణంగా ఉన్న పరిస్థితి కనిపిస్తుంది. ఏపీలో రోడ్ల దుస్థితిపై తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు చేయడానికి వెళ్ళిన చిన్న జీయర్ స్వామి వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది. చిన్నజీయర్ స్వామి కూడా ఏపీ ప్రభుత్వ అసమర్థతని తెలియజేశారు అన్న చర్చ సాగుతుంది. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, అనేక రకాల పన్నులతో, టోల్ వసూళ్ల తో ప్రజలను బాదుతున్న జగన్ సర్కార్ రాష్ట్రంలో రహదారుల మరమ్మతు పనులు చేపట్టడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక జనసేన కూడా రోడ్ల దుస్థితిపై డిజిటల్ క్యాంపెయిన్ నిర్వహించింది. పెద్ద ఎత్తున పోరాటాలకు తెరతీసింది. ఇక తాజాగా గడపగడపకు ప్రభుత్వం పేరుతో వెళుతున్న వైసిపి ప్రజాప్రతినిధులకు రోడ్ల సమస్యపై కూడా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

## జగన్ దగ్గరకు గన్నవరం పంచాయితీ

విజయవాడ, మే 20, గన్నవరం నియోజకవర్గంలోని వైసీపీలో విభేదాలు రచ్చకెక్కాయి. టీడీపీ నుంచి వైసీపీలో చేరిన ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్, వైసీపీ నేత దుట్టా రామచంద్రరావు మధ్య కొంతకాలంగా గ్రూప్ తగాదాలు నడుస్తున్నాయి. ఈ విషయం సీఎంవో వరకు వెళ్లడంతో వారిద్దరికి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి పిలుపు వచ్చింది. వీరి పంచాయతీ వివాదంపై పరిష్కరించేందుకు తొలుత బుధవారం సాయంత్రం రావాలని ఆదేశించినా? అనంతరం గురువారం సాయంత్రం 6గంటలకు తాడేపల్లికి రావాలని సీఎంవో సూచించింది. గన్నవరం అంటే టీడీపీకి కంచుకోట లాంటి నియోజకవర్గం. 2014, 2019 ఎన్నికల్లో వరుసగా టీడీపీ నుంచి వల్లభనేని వంశీ విజయం సాధించారు. అయితే 2019 ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం రాకపోవడంతో వల్లభనేని వంశీమోహన్ భవిష్యత్ అవసరాల దృష్ట్యా అధికార పార్టీ వైసీపీలో జంప్ అయ్యారు. ఆయన వైసీపీలోకి అడుగుపెట్టిన నాటి నుంచి గన్నవరం వైసీపీలో రచ్చ జరుగుతూనే ఉంది. వల్లభనేని వంశీ తన సొంత వర్గానికే ప్రాధాన్యత ఇస్తూ అసలైన కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారని వైసీపీ అధిష్టానానికి పలుమార్లు ఫిర్యాదులు అందాయి. మరోవైపు గన్నవరం వైసీపీ ఇంఛార్జిని నియమించాలని వైసీపీ కార్యకర్తలు అధిష్టానాన్ని డిమాండ్ చేస్తున్నారు. వల్లభనేని వంశీని పక్కన పెట్టి నిజమైన వైసీపీ నాయకుడికి ఇంఛార్జి బాధ్యతలు ఇవ్వాలని వాళ్లు కోరుతున్నారు. ప్రస్తుతం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుండటంతో వల్లభనేని వంశీ, దుట్టా రామచంద్రరావు వర్గాల మధ్య మరోసారి ఆధిపత్య పోరు ప్రారంభమైంది. దీంతో వీరి వివాదంపై పరిష్కారం చూపేందుకు సీఎం కార్యాలయం దృష్టి సారించింది. లా లెక్కలు వేసుకుని వైసీపీలో మంచి భవిష్యత్తు ఉంటుందని ఊహించారు.. కానీ ఇప్పుడు పరిస్థితి అంతా రివర్స్ అవుతోంది. వల్లభనేని వ్యతిరేకులంతా.. కూడబల్లుకుని ఎంపీ విజయసాయి రెడ్డి కి లేఖలు రాశారు.. గన్నవరంలో వంశీకి సీటు ఇస్తే ఓడిస్తామని.. కాదని ఎవరికి ఇచ్చినా గెలిపించుకుంటా అంటూ ఘాటుగా లేఖలు రాశారు. ఇక గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలోనూ ఆయన ఫ్లెక్సీలు కనిపించనీయకుండా చేశాయి ప్రత్యర్థి వర్గాలు. ఇటు వంశీ అనుచరులు సైతం.. ప్రత్యర్థి వర్గాన్ని పక్కన పెట్టి.. కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో గన్నవరం నియోజకవర్గంలోని వైసీపీలో విభేదాలు మరింత హాట్ హాట్ గా మారాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్, వైసీపీ నేత దుట్టా రామచంద్రరావు మధ్య కొంతకాలంగా గ్రూప్ తగాదాలు ఉన్నా.. ఇప్పుడు అవి పీక్ కు చేరాయి. ఈ విషయం సీఎం ఆఫీసు వరకు వెళ్లింది. దీంతో ఆ ఇద్దరి వ్యవహారం త్వరగా తేల్చాయాలని సీఎం జగన్ అభిప్రాయపడుతున్నారు. ఇందులో భాగంగా ఇవాళ వారిద్దరికి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి పిలుపు వచ్చింది. వీరి పంచాయతీ వివాదంపై పరిష్కరించేందుకు మొదట బుధవారం సాయంత్రం రావాలని ఆదేశించినా? సీఎం బిజీ షెడ్యూల్ కారణంగా.. గురువారం సాయంత్రం 6గంటలకు తాడేపల్లికి రావాలని సీఎంవో సూచించింది. సాధారణంగా గన్నవరం అంటే టీడీపీకి కంచుకోట లాంటి నియోజకవర్గం. 2014, 2019 ఎన్నికల్లో వరుసగా టీడీపీ నుంచి వల్లభనేని వంశీ విజయం సాధించారు. అయితే 2019 ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం రాకపోవడంతో వల్లభనేని తన భవిష్యత్తు దృష్ట్యా అధికార పార్టీ వైసీపీలో జంప్ అయ్యారు. అయితే అప్పటి నుంచి అక్కడి వైసీపీ వర్గం పోరు ఊపందుకుంది. వంశీ తన సొంత వర్గానికే ప్రాధాన్యత ఇస్తూ అసలైన కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారని వైసీపీ అధిష్టానానికి పలుమార్లు ఫిర్యాదులు అందాయమరోవైపు గన్నవరం వైసీపీ ఇంఛార్జిని నియమించాలని వైసీపీ కార్యకర్తలు అధిష్టానాన్ని డిమాండ్ చేస్తున్నారు. వల్లభనేని వంశీని పక్కన పెట్టి నిజమైన వైసీపీ నాయకుడికి ఇంఛార్జి బాధ్యతలు ఇవ్వాలని వాళ్లు కోరుతున్నారు. అయితే సాధారణంగా ఇంఛార్జ్ కే.. వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇచ్చే అవకాశం ఉంటుంది. దీంతో ఆ పదవి తనకే ఇవ్వాలన్నది వంశీ ఆలోచన.. మరి దీనిపై సీఎం జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి..

## జగన్ ఇలాకాలో చంద్రబాబు జోష్

కడప మే 20, (న్యూస్ పల్స్)కడప అంటే వైసీపీకి అడ్డా.. సీఎం జగన్ కు కేరాఫ్ అడ్రస్.. తెలుగు దేశం అధికారంలో ఉన్నప్పుడు సైతం కడప వెళ్తే.. చంద్రబాబుకు రెస్పాన్స్ అంతంత మాత్రమే ఉండేది.. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అవుతోందా.? సీఎం ఇలాకాలో చంద్రబాబు టూర్ గ్రాండ్ సక్సెస్ ను ఏ విధంగా చూడాలి..?సీఎం జగన్ ఇలాకా.. కడపలో ఏం జరుగుతోంది.. సాధారణంగా కడప అంటే వైసీపీ అడ్డా అనే చెప్పాలి. ఇతర పార్టీలకు ఈ మధ్య కాలంలో అంత ఆదరణ కనిపించడం లేదు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు సైతం.. ఆయన టూర్లకు అక్కడ అంతంతే రెస్పాన్స్ ఉండేది.. ప్రస్తుతం టీడీపీ రాష్ట్రంలో ఉనికి కోసం పోరాడుతోంది. గత ఎన్నికల్లో ఘోరంగా ఉడేంది. ఇలాంటి సమయంలో చంద్రబాబు కడప పర్యటన ఏపీ రాజకీయాల్లో ఆసక్తిని పెంచింది. తెలుగుదేశం పార్టీ నేతలు సైతం ఊహించని విధంగా ప్రజా స్పందన కనిపించింది. కడపలో చంద్రబాబు వెళ్లిన ప్రతి చోటా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇది సైతం ప్రతిపక్షానికి ఆయుధంలా దొరికింది. సీఎం జగన్ సొంత అడ్డాలోనే ప్రభుత్వ వ్యతిరే?కత ఎంత ఉందో అర్థమవుతోందని.. చంద్రబాబు టూర్ ను ఉదహరణగా టీడీపీ నేతలు చెబుతున్నారు. ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను బాదుడే బాదుడు కార్యక్రమం ద్వారా జనాల్లోకి వెళుతున్నారు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు. ఇందులో భాగంగా మొన్న కడపలో బాదుడే బాదుడు కార్యక్రమానికి కడప విమానాశ్రయం చేరుకున్న బాబుకి అడుగడుగునా జనం నీరాజనం పలికారు. కడపలో జరిగిన కార్యకర్తల సమావేశంలో భారీ స్థాయి కార్యకర్తలు పాల్గొని ఎన్నడూ లేని విధంగా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చెన్నూరు, దుంపలగట్టు, ఖాజీపేట, కమలాపురం, శివారుల్లో బ్రహ్మరథం పట్టారు. మహిళలు నీరాజనం పడితే క్రేన్ ద్వారా పూల మాలలు వేశారు. సీఎం సొంత జిల్లాలో అశేష జనవాహిని నడుమ చంద్రబాబు నాయుడు రోడ్ షో., బహిరంగ సభలు జరిగాయి. రాజారెడ్డి కాలం నుంచి నేటి వరకు వైఎస్ కుటుంబ సభ్యులు ప్రతిరిత్యం వహిస్తున్న పార్టీలకు తప్ప వేరొక పార్టీ నాయకుల సభలో జనాలు వచ్చే వారు కారు. మద్యం., బిరియని., డబ్బులు ఇస్తామన్న జనాలు వచ్చేది మాత్రం అంతంతమాత్రంగానే వుంటుంది. చంద్రబాబు రాజకీయ ప్రస్థానం మొదలైన నాటి నుంచి నేటి వరకు కడపకు వచ్చిన సమయంలో ఇంతటి జనసందోహాన్ని ఎన్నడూ చూడలేదంటున్నారు రాజకీయ విశ్లేషకులు. మద్యం., డబ్బులు, బిరియని పంపకం లేకుండా భారీస్థాయిలో జనాలు వచ్చారని.. టీడీపీ పార్టీ నుంచే కాదు వైసీపీ పార్టీలోనూ జోరుగా ప్రచారం సాగుతోందట. ప్రభుత్వం వైపు వ్యతిరేకత ఉండటం సర్వసాధారణం అయినా.. సీఎం కంచుకోటలో ఇంతటి స్థాయిలో వ్యతిరేకత ఉంటుందని ఎవరు ఊహించలేదు. సీఎం ఇలాకాలో ఎవరు వచ్చిన జనాలు రారని.. భావించిన అధికార పార్టీ నేతలు చంద్రబాబు బాదుడే బాదుడు కార్యక్రమానికి వచ్చిన జనాదరణ చూసి లోకల్ టీడీపీ నాయకులలో ఫుల్ జోష్ లో కనిపిస్తున్నారు. ముఖ్యంగా ఈ సభలను పోలీసులు అడ్డుకోవాలని ప్రయత్నించారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే అంతమంది జనం రావడంతో అధికార పార్టీలో అలజడి మొదలైంది. చంద్రబాబు తాజా పర్యటన అధికార వైసీపీలో భయం పుట్టిందనే ప్రచారం జరుగుతోంది. ఊహించని విధంగా జనవాహిని రావడంతో కడప వైసీపీ నేతల్లో టీడీపీ భయం కొత్తగా పట్టుకుంది అంటున్నారు. ఇన్నాళ్లు ఏమి కాదు...ఎవరు ఏమి చేయలేరు అని ధీమాగా ఉన్న ప్రభుత్వానికి చంద్రబాబు బాదుడే బాదుడు కార్యక్రమం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది



## ప్రాణాల మీదకు వాటర్ ఫాల్

ఏలూరు, మే 20, అల్లూరిసీతారామరాజు జిల్లాలో జలపాతాలు పర్యాటకులకు ఒకవైపు ఆహ్లాదాన్ని, ఆనందాన్నిస్తుంటే అక్కడికి వెళ్ళినవారు మరణించడంతో విషాదం నెలకొంటోంది. సరియా జలపాతం టూరిస్టుల పాలిట మృత్యుకుహరంగా మారింది. అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ పరిధిలోని సరియా జలపాతం ప్రమాదభరితంగా మారింది. మంగళవారం సరియా జలపాతానికి విహారానికి వచ్చిన విశాఖకు చెందిన ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. వారి మృతదేహాలను అనంతగిరి పోలీసులు ఎట్టకేలకు గుర్తించి ఒడ్డుకు చేర్చారు. విశాఖ జగదాంబ సమీపంలోని ఎల్లమ్మతోట ప్రాంతానికి చెందిన నలుగురు స్నేహితులు మంగళవారం సరియా జలపాతం సందర్శించేందుకు వచ్చారు. వారిలోదుక్కసాయి 39 ప్రమాదవశాత్తూ జలపాతంలో జారిపడగా తనను రక్షించే ప్రయత్నంలో చైతన్య అనే 17 ఏళ్ళ యువకుడు కూడా అందరి కళ్లముందే గల్లంతయ్యాడు. దీంతో ఆందోళనకు గురైన మిగిలిన ఇద్దరు స్నేహితులు సమీపంలోని దేవరాపల్లి పోలీస్ స్టేషన్ కి వెళ్లి ఫిర్యాదు చేయగా రాత్రి సమయం కావడంతో ఎటువంటి గాలింపు చర్యలు చేపట్టలేదు. వేకువ జామున అనంతగిరి పోలీసులు గజ ఈతగాళ్లతో మృతదేహాలను గుర్తించారు. మృతదేహాలను ఒడ్డుకుచేర్చి, అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సరియా జలపాతంపై పోలీసులు స్థానికులు పలు హెచ్చరికలు సూచనలు చేస్తున్నప్పటికీ తరచూ పర్యాటకులు జలపాతంలో మృత్యువాతకు గురవుతున్నారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినప్పటికీ పర్యాటకులు వాటిని పట్టించుకోకపోవడంతో ప్రమాదాలకు గురై వారి కుటుంబాలను శోకసంద్రంలో ముంచుతున్నారు. ఇప్పటికే సరియా జలపాతంలో పదులసంఖ్యలో పర్యాటకులు మృత్యువాతకు గురయ్యారు. ముఖ్యంగా యువకులే ఈప్రమాదంలో ఎక్కువగా చనిపోతున్నారు. కావున ఇప్పటికైనా తల్లిదండ్రులు వారి పిల్లలను సరియా జలపాతాన్ని సందర్శనకు పంపించే విషయంలో తగుజాగ్రత్తలు తీసుకుంటే జలపాతంలో ప్రమాదాలను నివారించవచ్చు. ఈప్రమాదంలో చనిపోయిన సాయికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విశాఖలో చిన్న కిరాణా దుకాణం నడుపుతున్నాడు. చైతన్య ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

## పశ్చిమలో కోలుకోనేది ఎలా

ఏలూరు, మే 20, ప్రధాన ప్రతిపక్షం టీడీపీకి బలంగా ఉన్న జిల్లా పశ్చిమ గోదావరి. 2014లో క్లీన్ స్వీప్ చేసిన తర్వాత మరింతగా బలం పుంజుకుంటుందని భావించినా 2019 ఎన్నికల్లో మాత్రం పార్టీ జిల్లాలో రెండు సీట్లకు పరిమితం అయ్యింది. మెట్ట ప్రాంతంలో జిల్లా కేంద్రంగా ఉన్న ఏలూరులో ఇటు ఎంపీ, అటు ఎమ్మెల్యే స్థానాల్లోనూ టీడీపీ ఓడిపోయింది. అయితే.. ఎన్నికలు జరిగిన కొద్దికాలానికే మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి హఠాన్మరణం చెందారు. ఇక్కడ బుజ్జి సోదరుడు బడేటి రాధాకృష్ణయ్య (చంటి)కు అవకాశం కల్పించారు. అయితే బుజ్జిలో ఉన్న దూకుడు ఇప్పుడు చంటిలో కనిపించడం లేదు. బుజ్జి మరణాంతరం సానుభూతి వర్కవుట్ అవుతుందనే చంద్రబాబు ఆయన సోదరుడికి నియోజకవర్గ పగ్గాలు ఇచ్చినా ఆయన అక్కడ టీడీపీని ఎంత వరకు నడిపిస్తారన్న దానిపై పార్టీ నేతల్లోనే అనేక సందేహాలు ఉన్నాయి. అక్కడ డిప్యూటీ సీఎంగా ఉన్న ఆళ్ల నానిని తట్టుకుని కేడర్‌ను నిలబెట్టే పరిస్థితి లేదు. ఇక, పార్లమెంటు స్థానంలో రెండున్నర దశాబ్దాలకు పైగా పాతుకుపోయిన మాజీ మంత్రి, మాజీ ఎంపీ మాగంటి బాబు 2019 ఎన్నికల్లో మాత్రం ఓడిపోయారు. దీనికితోడు అనారోగ్య కారణాలతో ఆయన పార్టీకి దూరంగా ఉన్నారు. ఇక, ఇక్కడ నుంచి ఆయన తనకుమారుడు రాంజీని రాజకీయంగా నిలబెట్టాలని అనుకున్నా ఆయన ఆకస్మికి మరణంతో ఏలూరులో టీడీపీకి బలమైన నాయకుడు అంటూ లేకుండా పోయాడు. దీంతో ఇప్పుడు పార్లమెంటు స్థానంలోను, అసెంబ్లీ స్థానంలోనూ పార్టీ పరిస్థితి ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో ఈ రెండు చోట్ల వచ్చే ఎన్నికల నాటికి గెలుపు మాట అటుంచితే టీడీపీని నిలబెట్టేందుకు కూడా బలమైన నేతలు లేని దుస్థితిలో టీడీపీ ఉంది. మరో మూడేళ్ల తర్వాత వచ్చే ఎన్నికలకు సంబంధించి ఎమ్మెల్యే అభ్యర్థిపై కసరత్తు జరగాలని ఇప్పటి నుంచే నేతలు కోరుతున్నారు. బడేటి చంటి ఏలూరు ఇన్‌చార్జ్‌గా ఉన్నా ఆశించిన విధంగా పార్టీలో దూకుడు చూపించలేక పోవడం ప్రధానంగా మైనస్ అయిపోయింది. చంద్రబాబు అనేక కార్యక్రమాలకు పిలుపు ఇచ్చినా.. ఈయన నామ్ కే వాస్తే.. న్నట్టుగా వ్యవహరిస్తున్నారు. కార్పోరేషన్ ఎన్నికల్లో పార్టీ ఓడిపోతుందని ముందే డిసైడ్ అయిన చంటి ఎన్నికలను సీరియస్‌గా తీసుకోలేదు. పార్లమెంటు పరిధిలోకి వస్తే.. వచ్చే ఎన్నికల నాటికి మాగంటి బాబు కూడా తప్పుకొనే పరిస్థితి కనిపిస్తోంది. వాస్తవానికి గత ఎన్నికల్లోనే ఆయన తప్పుకుందామని అనుకున్నారు. కానీ, అప్పట్లో చంద్రబాబు ఒత్తిడి తెచ్చి.. పోటీకి పెట్టారని ప్రచారం జరిగింది. సో.. ఇప్పుడు ఈయన కూడా టీడీపీ తరపున పోటీకి దిగే పరిస్థితి లేదు. ఓవరాల్‌గా చూస్తే జిల్లా కేంద్రంలో ఈ రెండు స్థానాలకు ఇద్దరు బలమైన నేతలను వెతకాల్సిన బాధ్యత బాబుపై ఉంది. లేనిపక్షంలో ఇక్కడ పార్టీ బతికే పరిస్థితి లేదని పార్టీ నేతలు గగ్గోలు పెడుతున్నారు.

## టీడీపీ నేతలకు ఆర్థిక కష్టాలు

విజయవాడ, మే 20, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పార్టీ నేతలను కట్టడి చేయలేకపోతున్నారు. అసలే 2019 ఎన్నికల్లో షాక్ తో ఉన్న నేతలు వరస ఓటములతో బాగా డీలాపడిపోయారు. వరసగా వచ్చిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లోనూ చాలా మంది దూరంగా ఉన్నారు. ఆర్థికంగా బలమైన ఉన్న నేతలనే బరిలోకి కొందరు దింపారు. మరికొందరు కరోనా పేరుతో ఎవరినీ దగ్గరకు రానివ్వలేదు. ఈ విషయాన్ని కొందరు కేంద్ర పార్టీ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అయితే చంద్రబాబు ఈ మధ్య నేతలతో జరిపిన వీడియో కాన్ఫరెన్స్ లో ఈ విషయాన్ని ప్రస్తావించారు. అయితే నేతలు అందుకు ధీటుగానే సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. తాము గత ఎన్నికలకు చేసిన అప్పుల నుంచే ఇంకా కోలుకోలేదని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ వ్యాపారాలన్నీ బంద్ అయ్యాయని కూడా కొందరు చెప్పారు. తాము హైదరాబాద్ లో ఉంటూ వ్యాపారాలు చూసుకుంటున్నామని గుంటూరు జిల్లాకు చెందిన ఒక నేత చెప్పినట్లు తెలిసింది. మూడేళ్ల ముందు నుంచే నియోజకవర్గంలో పార్టీని నడపాలంటే తమ శక్తి సరిపోదని కొందరు సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. ఎన్నికలకు ఒకటిన్నర సంవత్సరం ముందు మాత్రమే తాము నియోజకవర్గంలో యాక్టివ్ గా కార్యక్రమాలు చేపడతామని, అప్పటి వరకూ అడపాదడపా నియోజకవర్గాన్ని పర్యటిస్తామని తెగేసి చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో చంద్రబాబు అలా అయితే ఎలా కుదురుతుంది? ప్రజల్లో ఉంటేనే కదా? వచ్చే ఎన్నికల్లో గెలిచేది అని అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో చంద్రబాబు నేతల్లో భయం పోయిందని గ్రహించారు. దీంతో కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించాల్సి వస్తుందని, టీడీపీలో నేతలకు కొరత లేదని చంద్రబాబు ఒకింత గట్టిగానే చెప్పినట్లు తెలిసింది. కరోనా తగ్గిన వెంటనే నియోజకవర్గాల్లో యాక్టివ్ గా లేని నేతలను తాను ఉపేక్షించబోనని, ప్రత్యామ్నాయం చూసుకోవాల్సి ఉంటుందని చంద్రబాబు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది.

# మంత్రుల టూర్... టార్గెట్ ఏంటీ

విజయవాడ, మే 20, : ఆంధ్రప్రదేశ్ లో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. అన్ని పార్టీలు జనం జపం చేస్తున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలు అన్నీ జనంలోనే ఉన్నాయి. ఇక అధికార వైసీపీ ఇప్పటికే గడప గడపకు ప్రభుత్వం అంటూ.. పథకాలపై ఆరా తీస్తున్నారు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతినిధులు.. అయితే ఈ కార్యక్రమంపై మిశ్రమ స్పందన కనిపిస్తోంది. మొదట ఎమ్మెల్యే గ్రాఫ్ పెంచడానికి ఈ కార్యక్రమం అని చెప్పినా.. చివరిలో పేరు మార్చి.. ప్రభుత్వ పథకాలు, పనితీరుపై ప్రజల స్పందన ఏంటో తెలుసుకోవడానికి గడప గడపకు ప్రభుత్వం పేరుతో ఇంటింటికీ వెళ్తున్నారు. అయితే చాలాచోట్ల నిరసన సెగలు ఎదురవుతున్నాయని విపక్షాలు అంటుటన్నాయి. వాటికి వీడియోలు సైతం సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నాయి. వైసీపీ నేతలు మాత్రం.. తమ కార్యక్రమానికి అద్భుత స్పందన వస్తోంది అంటున్నారు.ఈ బస్సు యాత్ర ఉద్దేశం వేరని టీడీపీ నేతలు అంటున్నారు. మహానాడు నుంచి దృష్టి మళ్లించేందుకు వైసీపీ బస్సు యాత్ర ప్లాన్ చేసిందని స్వయంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆరోపిస్తున్నారు. సరిగ్గా మహానాడు జరుగుతున్న సమయంలోనే.. వైసీపీ ఈ బస్సు యాత్రను పెట్టుకుంది. అందుకే ప్రతిపక్షం ఆరోపిస్తోంది. గడప గడపకు అని వెళ్తే.. ప్రజల నుంచి నిరసన సెగలు ఎదురవుతున్నాయని.. ప్రజల నుంచి చీత్కారాలు తప్పించుకోవడానికే ఇప్పుడు అధికార పార్టీ మనసు మార్చుకుందని విమర్శలు ఉన్నాయి.విపక్షాల విమర్శలు ఎలా ఉన్నా..? ఈనెల 26 నుంచి 29 వరకు వైసీపీ మంత్రులు బస్సు యాత్ర చేపట్టడానికి సిద్ధం అయ్యారు. మంత్రులు బొత్స, ధర్మాన, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మేరుగ నాగార్జున బస్సు యాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ.. సామాజిక న్యాయ భేరీ పేరుతో బస్సు యాత్రను చేపడుతున్నామన్నారు. నాలుగు రోజుల పాటు వరుసగా నాలుగు బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. బస్సు యాత్ర శ్రీకాకుళం నుంచి ప్రారంభమై అనంతపురంలో ముగుస్తుందన్నారు.ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓట్లే టార్గెట్ గా ఈ యాత్ర సాగుతున్నట్టు సమాచారం. ఆయా వర్గాల ఓట్లు సాలిడ్ గా ప్రభుత్వానికి పడితే మరోసారి గెలుపు తమదే అని వైసీపీ అధిష్టానం అంచనావేస్తోంది. అందుకే ఆయా ఓట్లు టార్గెట్ గానే ఈ యాత్రం ఉంటుందని సమాచారం.. ఈ బస్సు యాత్రలో 17 మంది మంత్రులతో పాటు వైసీపీకి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజాప్రతినిధులు పాల్గొంటారని మంత్రి ధర్మాన వెల్లడించారు. పాలన చేసే వారుగా ఎప్పుడు మారతాం అన్న ఆవేదన ఈ నాలుగు వర్గాల్లో ఉందని.. వీరి ఆత్మ ఘోషణను నివారించడానికి వైసీపీ కంకణం కట్టుకుందన్నారు.గతంలో బలహీన వర్గాలకు మంత్రి పదవి ఇస్తే చాలా గొప్ప విషయంగా భావించే వారు అని.. వెనుకబడిన వర్గాల వారు మంత్రి పదవులు పొందడానికి అర్హులు కారనే భావజాలం ఉండేదని.. అదే ప్రస్తుతం కేబినెట్ ను పరిశీలిస్తే.. 77 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారే ఉండటం గమనించాల్సిన విషయమని మంత్రి ధర్మాన అన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడైనా ఇలా జరిగిందా అని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో బలహీన వర్గాలకు ఒక రాజ్యసభ స్థానం ఇచ్చిన దాఖలాలు కూడా లేవన్నారు. ప్రభుత్వం ప్రజల కోసం ఏం చేయలేదని చెప్పి నమ్మించాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని మంత్రి ధర్మాన విమర్శించారు. వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడానికే తాము బస్సు యాత్ర చేస్తున్నట్లు చెప్పారు.

## పెళ్లి బస్సు బోల్తా..ఒకరు మృతి

కాకినాడ పెళ్లి బృందం బస్సు బోల్తా ఒకరు మృతి మిగిలిన వారికి గాయాలుకాకినాడ జిల్లా గండేపల్లి మండలం నీలాద్రిరావు పేట సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల యాభై నిమిషాల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పెళ్లి బస్సు బోల్తా పడింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో జరగనున్న పెళ్లికి వరుడు తో సహా 37 మంది కుటుంబ సభ్యులు బస్సులో విజయనగరం నుంచి ఏలూరు ప్రయాణమయ్యారు. అయితే మార్గంమధ్యలో గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిపై బస్సు బోల్తా పడింది. ఈ బస్సులో పెళ్లి కొడుకు తో సహా 36 మంది కి గాయాలు కాగా ఒకరి పై ఒకరు పడడంతో పెళ్లి కొడుక్కి వరుసకు పెదనాన్న అయన గుడిపాటి వెంకట కోదండరామయ్య అనే వ్యక్తి ఊపిరి ఆడకపోవడంతో బస్సులోనే మృతిచెందారు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వైద్య సేవ నిమిత్తం రాజానగరం జిఎస్ఎల్ హాస్పిటల్ కి తరలించారు. జగ్గంపేట సిఐబి సూర్య అప్పారావు, గండేపల్లి ఎస్సై గణేష్ లు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 5 రూపాయిలకే ఆర్టీసీ లో వెళ్లవచ్చు

హైద్రాబాద్, మే 20, (న్యూస్ పల్స్)ఎస్ఆర్టీసీ ఎండీగా వీసీ సజ్జనార్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆర్టీసీని లాభాల బాటలో తీసుకువచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొత్త కొత్త ఆలోచనలకు శ్రీకారం చుడుతున్నారు. అయితే.. నిత్యం వాహనాల రద్దీతో పద్మవ్యూహాన్ని తలపించే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో ప్రయాణికులకు అతి పెద్ద ఊరట లభించనుందిరైల్వేస్టేషన్‌కు నాలుగు వైపులా ఉన్న బస్టాపులను అనుసంధానం చేస్తూ మినీ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా ఓ బస్సును ఏర్పాటు చేశారు. కేవలం రూ.5 టికెట్‌తో ప్రయాణికులు ఒక బస్టాపు నుంచి మరో బస్టాపు వరకు వెళ్లవచ్చు. కేవలం రెండు మూడు కిలోమీటర్ల పరిధిలోనే ఉన్న ఆయా బస్టాపుల్లో ఒకచోట నుంచి మరో చోటకు వెళ్లేందుకు ప్రయాణికులు నడక దారిలో అవస్థల పాలవుతున్నారు.ఆటోల్లో వెళ్లాలంటే కొద్దిపాటి దూరానికే రూ.50 నుంచి రూ.100 వరకు చెల్లించుకోవాల్సి వస్తోంది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చుట్టూ ఉన్న బస్టాపుల్లో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ప్రత్యేకంగా దృష్టి సారించింది.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం



కమాన్ పూర్ రామగుండం కార్పొరేషన్ లోని ఎనిమిదోవ కాలనీ లో సిసి రోడ్ లకు కార్పొరేటర్ సాగంటి శంకర్ భూమి పూజ చేశారు. రామగుండం శాసనసభ్యులు టిఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ మరియు మేయర్ బంగి అనిల్ కుమార్ సహకారంతో 8వ కాలనీ 17 వ డివిజన్ సంతోష్ నగర్ లో స్థానిక కార్పొరేటర్ మాజీ డిప్యూటీ మేయర్ సాగంటి శంకర్ఆధ్వర్యంలో పలు రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు మేడి సదానందం ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి గోపాల్ రావు సమన్వయ కమిటీ మెంబర్ గూడెల్లి రామ్ చందర్ యువత విభాగం అధ్యక్షుడు సారయ్య నాయక్ విద్యార్థి విభాగం అధ్యక్షులు పులి రాకేష్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ నాయక్ నల్ల మధుకర్ రెడ్డి ముక్కెర మొగిలి తమ్మనవేణి కుమార్ యాదవ్ రామగిరి ఆంజనేయులు(సింహం) కనుకయ్య రాజమౌళి సాయి తదితరులు పాల్గొన్నారు.

### మర్రిపాడు మండలంలో పర్యటించిన మేకపాటి విక్రమ్ రెడ్డి

నెల్లూరు నెల్లూరు జిల్లా పరిధిలోని ఆత్మకూరు నియోజకవర్గ ఉప ఎన్నికలలో వైకాపా అభ్యర్థిగా ఖరారు కాబడిన ఆత్మకూరు వైసీపీ ఇన్ చార్జ్ మేకపాటి విక్రమ్ రెడ్డి 2వ రోజు మర్రిపాడు మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజుపాడు గ్రామంలో పర్యటించి,ప్రభుత్వ సంక్షేమ పథకల అమలవుతున్న తీరు ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు .గడచిన 3 సంవత్సరాలలో ప్రభుత్వం తరపున వచ్చిన పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం ద్వారా ఆయా సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు . త్వరలో ఆత్మకూరు నియోజకవర్గంలో జరగనున్న ఉప ఎన్నికలలో వైకాపా అభ్యర్థిగా తనను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక వైసీపీ నేతలు, కార్యకర్తలు ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి

### నేడు జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవం

ఇందిరా గాంధీ మరియు ఫిరోజ్ గాంధీ ల పెద్ద కుమారుడు, భారతదేశ 7వ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి ఈ రోజు. తల్లి ఇందిర మరణముతో ప్రధానమంత్రి అయిన రాజీవ్ 1989 , డిసెంబరు 2 న సాధారణ ఎన్నికలలో పరాజయము పాలయ్యేవరకు ప్రధానమంత్రిగా పనిచేశాడు. 40 సంవత్సరాల వయసులో ప్రధానమంత్రి అయిన రాజీవ్ గాంధీ భారత ప్రధానమంత్రి అయిన అతి పిన్న వయస్కుడు.శ్రీలంక దేశానికి చెందిన తమిళ తీవ్రవాదులు(ఎల్.టి.టి.ఈ) చేసిన మానవ బాంబు దాడిలో మరణించాడు. 1944వ సంవత్సరంలో ఇందిరాగాంధీ - ఫిరోజ్గాంధీ దంపతులకు పెద్ద కుమారునిగా రాజీవ్ గాంధీ జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసాన్ని డెహ్రాడూన్లో పూర్తి చేసిన రాజీవ్, ఉన్నత విద్యాభ్యాసం ఇంగ్లండ్లో పూర్తి చేశారు. తరువాతి కాలంలో తను అత్యంత అభిమానించే 'ఫ్లైయింగ్' రంగంలో శిక్షణ పొందిన రాజీవ్గాంధీ, ఇండియన్ ఎయిర్ లైన్స్లో పైల్టా తన ఉద్యోగజీవితాన్ని ప్రారంభించారు. ఇంగ్లండ్లో చదువుతున్న సమయంలోనే రాజీవ్ ఇటాలియన్ యువతి అయిన సోనియాను ప్రేమించడం, తరువాతి కాలంలో పెళ్ళి చేసుకోవడం జరిగింది. మొదట్లో ఇందిరాగాంధీ రాజకీయ వారసుడుగా సంజయ్గాంధీనే అని అందరూ భావించారు. అదే విధంగా రాజకీయ వ్యవహారాలలోనూ, కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలలోనూ, పరిపాలనా వ్యవహారాలలోనూ సంజయ్గాంధీ జోక్యం అధికంగా వుండేది. రాజీవ్గాంధీ మాత్రం చిన్ననాటి నుండి రాజకీయాల పట్ల పెద్దగా ఆసక్తి కనబరచేవారు కాదు. అందుకే రాజీవ్ తనకిష్టమైన రంగంలో ప్రవేశించి పైలెట్గా ఉద్యోగం చేయనారంభించారు. 1980వ సంవత్సరంలో ఒక ప్రమాదంలో సంజయ్గాంధీ మరణించారు. దాంతో ఇందిరాగాంధీ రాజీవ్గాంధీని తన రాజకీయవారసునిగా చేయాలని భావించి రాజీవ్ను పరిపాలనా వ్యవహారాలలో తనకు తోడుగా వుండమని కోరడం జరిగింది. భార్య సోనియాగాంధీ తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ, తల్లి కోరిక మేరకు రాజీవ్గాంధీ రాజకీయరంగ ప్రవేశం చేశారు. 1984వ సంవత్సరం అక్టోబర్ నెలలో తన అంగరక్షకుల చేత ఇందిరా గాంధీ హత్య గావించబడడంతో రాజీవ్గాంధీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. రాజకీయాల పట్ల ఆసక్తి లేకపోవడంతో చాలాకాలంపాటు రాజకీయాలకు దూరంగా వుండటం, అనుభవం లేకపోవడం వంటి కారణాల వల్ల రాజీవ్గాంధీ ఎక్కువ కాలం పరిపాలన సాగించలేదని అందరూ భావించారు. కానీ, వారందరి నమ్మకాలను వమ్ము చేసే విధంగా రాజీవ్ పూర్తికాలం పదవిలో కొనసాగడమేకాక, పరిపాలనా పరంగా పలుమార్పులు తీసుకురావడమేకాక, ఆధునిక రీతికి తగ్గట్లుగా పాలించి అందరి అభిమానాన్ని చూరగొన్నారు రాజీవ్. భారతదేశానికి ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన అత్యంత పిన్నవయస్కునిగా చరిత్ర సృష్టించారు రాజీవ్గాంధీ. ఆధునిక శాస్త్ర, సాంకేతిక రంగాలలో సంభవిస్తున్న మార్పులకనుగుణంగా భారతదేశాన్ని ముందుకు నడిపించిన సమర్ధనాయకుడు రాజీవ్గాంధీ. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగ ఆవశ్యకతను, భవిష్యత్తులో అది పోషించబోయే పాత్రను ముందుగానే ఊహించిన రాజీవ్ గాంధీలోని దార్శనికుడు, ఆ రంగానికి ప్రాధన్యమిచ్చాడు. కానీ, 'బోఫోర్స్' కంపెనీ నుండి ఆయుధాలు కొనడంలో భారీ అవకతవకలకు పాల్పడ్డారని అవినీతి ఆరోపణలు రాజీవ్గాంధీ ఎదుర్కోవడం వంటి కారణాల వల్ల 1989వ సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓటమి ఎదుర్కోవలసి వచ్చింది. వి.పి.సింగ్ ప్రధానమంత్రిగా 'జనతాదళ్' ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ పూర్తికాలం కొనసాగలేకపోయింది. దాంతో 1991వ సంవత్సరం లో మళ్ళీ ఎన్నికలు రావడం జరిగింది. ఆ ఎన్నికల్లో రాజీవ్ గాంధీకి అనుకూల సూచనలు కనపడ్డాయి. 1991వ సంవత్సరం మే21వ తేదీన తమిళనాడులో 'శ్రీ పెరంబుదూర్' కు ఎన్నికల ప్రచార నిమిత్తం వచ్చిన రాజీవ్గాంధీ సభావేదికవైపుగా వెళుతుండగా, ఎల్.టి.టి.ఈ 'ఆత్మాహుతిదళం' కు చెందిన మహిళ ఆయనకు దండ వేయడానికి వచ్చి బెల్టుబాంబు పేల్చడంతో రాజీవ్గాంధీ అక్కడికక్కడే మరణించారు. రాజీవ్ శరీరం ముక్కలు ముక్కలు కాగా, ఆయన కాలిబూటును బట్టి ఆయన శరీరాన్ని గుర్తించవలసి వచ్చింది. అంతకు ముందు రాజీవ్ ప్రధానిగావున్న సమయంలో శ్రీలంకలో ఎల్.టి.టి.ఈ తో పోరాటానికి భారతసైన్యాన్ని పంపడానికి వ్యతిరేకంగా ఎల్.టి.టి.ఈ టైగర్లు యీ విధంగా రాజీవ్గాంధీని హత్యచేసి పగ తీర్చుకున్నారు. యావత్ దేశం అభిమానించే రాజీవ్ గాంధీ చనిపోయిన నాటినుండి మే 21న జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించి నిర్వహిస్తున్నారు. తీవ్రవాద చర్యలు రూపుమాపి, దేశప్రజలు సహజీవనంతో మెలగాలన్నది ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం. తీవ్రవాదాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్న భావాన్ని ప్రజల్లో కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించి వారిచే తీవ్రవాద వ్యతిరేక దినం ప్రతిజ్ఞ చేయిస్తారు.

## కార్మికుల హక్కులను కాపాడేది టీబీజీకేఎస్....

### టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజి రెడ్డి

కమాన్ పూర్ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం గుర్తింపు కార్మిక సంఘం గా ఎల్లవేళలా సింగరేణి కార్మికవర్గం హక్కుల రక్షణ ధ్యేయంగా పనిచేస్తూ కొత్త హక్కులను తీసుకురావడమే లక్ష్యంగా ముందుకెళ్తుందని ఆర్ జి టు ఓ సి పి త్రీ కృషి భవన్ ద్వారా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూనియన్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజి రెడ్డి అన్నారు ఉపాధ్యక్షుడు ఆయిలి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ ద్వారా సమావేశం ఇంకా మాట్లాడుతూ గతంలో గుర్తింపు కార్మిక సంఘాలుగా జాతీయ కార్మిక సంఘాలు సింగరేణి కార్మికుల హక్కులను పోగొట్టడమే కాకుండా తీవ్రమైన ఆర్థిక మానసిక నష్టానికి గురిచేసిందని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం వచ్చిన తర్వాత మాత్రమే ఒక్క ఆందోళన కార్యక్రమం నిర్వహించకుండ 60కి పైగా హక్కులు తీసుకురావడం జరిగిందని కారుణ్య నియామకాల పేరుమీద పదివేల మందికి ఉద్యోగాలు కల్పించడం జాతీయ కార్మిక సంఘాల ద్వారా పెండింగ్లో ఉన్న మూడు వేల 400 మంది డిపార్ట్మెంట్లో ఉద్యోగం ఇప్పించడం బహిర్గత నోటిఫికేషన్ల ద్వారా 3800 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇప్పించడం 2 పి హెచ్ డి లు అదనంగా ఇప్పించడం అం 20 లక్షల మ్యాచింగ్ గ్రాంట్ ఇప్పించడం వన్ పర్సెంట్ విద్యుత్ ఛార్జీలు రద్దు చేయడమే కాకుండా ఉచితంగా ఏసీ కి విద్యుత్ వాడుకునే విధంగా ఆదేశాలు ఇప్పించడం తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం ఇలా కోల్ ఇండియా కు భిన్నంగా 20 రకాల హక్కుల్ని అదనంగా ఇచ్చిన చరిత్ర తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘంది అని సింగరేణి బొగ్గు బ్లాకులు బిజెపి ఆధ్వర్యంలో ని కేంద్ర ప్రభుత్వం వేలం వేస్తే దాన్ని తీవ్రస్థాయిలో కెసిఆర్ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గౌరవ అధ్యక్షురాలు కవిత నాయకత్వంలో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం తీవ్రంగా వ్యతిరేకించడం వల్ల సింగరేణికి ఆ నాలుగు బ్లాగులు దక్కే పరిస్థితులు ఏర్పడ్డాయని కానీ కోల్ ఇండియాలో జాతీయ కార్మిక సంఘాలు కలిసికట్టుగా అక్కడి ప్రభుత్వాలను కదిలించిక పోవడం వల్ల 200కు పైగా బొగ్గు బ్లాకులు ప్రైవేటు వారికి ధారాదత్తం చేయడం జరిగిందని జాతీయ కార్మిక సంఘాల నిర్లక్ష్యం వల్లనే కోల్ ఇండియాలో ఈ పరిస్థితి ఏర్పడిందని అయినా తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘంని విమర్శించడం సిగ్గుచేటని సింగరేణి పరిరక్షణకు టీబీజీకేఎస్ ఎప్పటికీ కట్టుబడి ఉంటుందని అన్నారు ఈ సందర్భంగా 50 మంది వివిధ యూనియన్ల కార్యకర్తలు టీబీజీకేఎస్ చేరగా మిర్యాల రాజి రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో కేంద్ర నాయకులు దేవా వెంకటేశం సత్యనారాయణ రెడ్డి ఎటం కృష్ణ జి ఎం కమిటీ మెంబర్ లు శంకర్ నాయక్ చెరుకు ప్రభాకర్ రెడ్డి ఐ. సత్యం దశరథం పైడి పెల్లి ప్రభాకర్ కరక శ్రీనివాస్ బేతి చంద్రయ్య బొద్దుల నరసయ్య సూర్య శ్యామ్ సమ్మయ్య మామిడి తిరుపతి మల్లయ్య సంజీవ్ రాజమౌళి చంద్రమౌళి మరియు కార్యకర్తలు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## 200 రూపాయిల కోసం లారీ ఎక్కించి చంపిన డ్రైవర్

గుంటూరు, మే 30, (న్యూస్ పల్స్)ప్రస్తుత సమాజంతో మానవ సంబంధాల కంటే మనీ సంబంధాలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. తాజాగా.. చిత్తు కాగితాలు ఏరుకునే ఓ మహిళ పట్ల లారీ డ్రైవర్ కర్కశంగా ప్రవర్తించాడు. పిల్లలతో కలిసి లారీ ఎక్కిన మహిళ పట్ల క్రూరంగా వ్యవహరించి ఆమె మృతికి కారణమయ్యాడు. అడిగినంత డబ్బు ఇవ్వలేదన్న కారణంతో ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేటకు చెందిన మహిళ చిత్తుకాగితాలు ఏరుకుంటూ జీవిస్తోంది. ఉపాధి కోసం తన ఇద్దరు పిల్లల్ని తీసుకుని చిలకలూరిపేట నుంచి గుంటూరుకు వెళ్లేందుకు లారీ ఎక్కింది. గుంటూరులోని నాయుడుపేట జిందాల్ కంపెనీ సమీపంలోకి చేరుకోగానే మహిళ తన పిల్లలతో కలిసి లారీ దిగింది. లారీ డ్రైవర్ కు వంద రూపాయలు ఇవ్వగా అతడు నిరాకరించాడు. ఇంకా రెండు వందల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. తన వద్ద డబ్బుల్లేవని ఆ మహిళ ఎంత చెప్పినా డ్రైవర్ వినిపించుకోలేదు.మహిళ కుమార్తె చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ని లాక్కున్నాడు. ఆమె సెల్ ఫోన్ కోసం లారీ ఎక్కగానే డ్రైవర్ బండి స్టార్ట్ చేసి ముందుకు పోనిచ్చాడు. అది చూసి కంగారు పడిన మహిళ.. కూతురు కోసం లారీని పట్టుకుని వేలాడుతూ కొంత దూరం అలానే వెళ్లింది. తర్వాత అదుపుతప్పి లారీ కింద పడి మృతి చెందింది. మహిళ మృతి చెందడం చూసిన డ్రైవర్ లారీ ఆపి అందులోని పాపను కిందికి దించి అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు నమోదు చేశారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు. లారీ కింద పడి మృతి చెందిన తల్లి మృతదేహంపై పడి పిల్లలు రోదిస్తున్న తీరు స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

## అసోంను కుదిపేస్తున్న వరదలు

గువాహటీ అస్సాం రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల బీభత్సం సృష్టిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలోని మెజార్టీ ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యాయి. 27 జిల్లాల్లో 6.62 లక్షల మంది వరద ప్రభావానికి గురయ్యారు. వేలాది మంది తమ నివాసాలను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. అనేక ప్రాంతాలు అంధకారంలోకి వెళ్లాయి. రోడ్లు ధ్వంసమయ్యాయి. పలుచోట్ల రైల్వే లైన్లు వరదలధాటికి తీవ్రంగా దెబ్బతిన్నాయి.భారీ వర్షాలు, వదరల కారణంగా రాష్ట్రంలో ఇప్పటి వరకు 9 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల సంఖ్యలో పశువులు మరణించాయి.

## ఎమ్మెల్సీ కారులో డ్రైవర్ మృతదేహం

కాకినాడ ఎమ్మెల్సీ అనంత ఉదయ్ బాబు కారులో డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం మృతదేహం కలకం రేపింది. గురువారం ఉదయం కారులో డ్రైవర్ను తీసుకెళ్లిన ఎమ్మెల్సీ, అర్ధరాత్రి యాక్సిడెంట్ అయిందని డ్రైవర్ తమ్ముడికి సమాచారం ఇచ్చారు. తెల్లవారుజామున రెండు గంటలకు డ్రైవర్ తల్లిదండ్రులకు తన కారులోనే మృతదేహాన్ని తీసుకు వచ్చారు. మృతదేహాన్ని కింద కుదించాలని తల్లిదండ్రులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఏం జరిగిందని ఆరా తీసిన తల్లిదండ్రులకు సమాధానం చెప్పకుండా అయన వేరే కారులో వెళ్లిపోయారు. తల్లిదండ్రులు పనిచేస్తున్న అపార్ట్మెంట్ ఎదుట ఎమ్మెల్సీ కారులో డ్రైవర్ మృతదేహం వుండిపోయింది. డ్రైవర్ సుబ్రహ్మణ్యం గత ఐదేళ్లుగా ఎమ్మెల్సీ ఉదయభాస్కర్ వద్ద పనిచేస్తున్నాడు.

## లారీ డ్రైవర్ అమానుషం..

### చెత్త ఏరుకునే మహిళ దుర్మరణం

అమరావతి గుంటూరు శివారు నాయుడుపేట జిందాల్ కంపెనీ సమీపంలో దారుణం జరిగింది. చెత్త కాగితాలు ఏరుకోవడానికి పిల్లలతో కలిసి చిలకలూరిపేట నుంచి ఒక మహిళ రమణ(40) వచ్చింది. చిలకలూరిపేట నుంచి గుంటూరుకు లారీలో వచ్చింది. గుంటూరు శివారు నాయుడుపేట వద్ద లారీ దిగి రూ.100 డ్రైవర్ కు ఇచ్చింది. అయితే రూ.300 ఇవ్వాలని మహిళను డ్రైవర్ డిమాండ్ చేసాడు. అంత డబ్బు లేదనడంతో.. పిల్లలను దించకుముందే డ్రైవర్ లారీ ముందుకు నడిపాడు. పిల్లల కోసం లారీని పట్టుకుని వేలాడుతూ కొంతదూరం వెళ్లిన మహిళఅదుపు తప్పి లారీ కింద పడి రమణ మృతి చెందింది. డ్రైవర్ లారీతో సహ పరారయ్యాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, లారీ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

## తహశీల్దార్ కారుకు ప్రమాదం?డీటీ మృతి

శ్రీకాకుళం శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ప్రయాణిస్తున్న కారు ప్రమా దానికి గురైంది.శ్రీకాకుళం నుంచి విజయవాడకు కారులో వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ప్రయాణిస్తున్న కారు బోల్తా పడింది. ఈ ప్రమా దంలో డిప్యూటీ తహసీల్దారు సతీష్ మృతి చెందారు. ఎమ్మార్వో వెంకట రావుకి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి గాయాలయ్యా యి. క్షతగా త్రులను చికిత్స నిమిత్తం విశాఖ అపోలో ఆసుపత్రికి తరలించారు. అనకాపల్లి మండలం శంకరం ఏలేరు కాలువ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో వాహనంలో 6 గురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు.

## ఘనంగా తారక్ జన్మదిన వేడుకలు

నూజివీడు నూజివీడు మండలం తుక్కులూరు జెబిఎల్ హోమ్ లో ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు జరిగాయి. మాజీ ఏఎంసీ చైర్మన్, రావిచర్ల గ్రామ సర్పంచ్ కాపా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రావిచర్ల శాలివాహన సంఘం యూత్ సభ్యులతో తుక్కులూరు జెబీఎల్ హోమ్ లోని వృద్ధులతో కలిసి ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ ను కట్ చేసి, వృద్ధులకు అల్పాహారాన్ని అందజేసి జూనియర్ ఎన్టీఆర్ నిండు నూరేళ్లు ఆరోగ్యంతో ఉండాలని దీవించారు. ఈ సందర్భంగా కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న వైసిపి అరాచకాలను అంతమొందించాలంటే తెలుగుదేశం పార్టీకి జూనియర్ ఎన్టీఆర్ సేవలు అవసరమన్నారు. నందమూరి తారకరామారావు పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించడం జరిగిందని, ఆయన ఆశయాలను బ్రతికించాలంటే జూనియర్ ఎన్టీఆర్ పార్టీకి అండగా ఉండి వైసిపి రాక్షస పాలన నుండి రాష్ట్ర ప్రజలను కాపాడాలన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నందమూరి కుటుంబ సభ్యులు అందరూ కలిసికట్టుగా వైసిపి అరాచక పాలనను అంతమొందించడానికి ముందుకు వచ్చి రాష్ట్ర ప్రజలకు సుభిక్షమైన పాలనను అందించాలని ఆకాంక్షించారు.

## జులై, ఆగస్టు నెలలకు టిక్కెట్లు శనివారం విడుదల

తిరుమల మే 20, (న్యూస్ పల్స్)తిరుమల శ్రీవారి భక్తులకు శుభవార్త. ప్రత్యేక దర్శనం కోసం టీటీడీ ఆన్‌లైన్లలో టికెట్లను విడుదల చేయనుంది ఉదయం జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన రూ. 300 దర్శన టికెట్లను విడుదల చేస్తున్నామని అధికారులు వెల్లడించారు. ఉదయం 9 గంటలకు టీటీడీ వెబ్‌సైట్లో టికెట్లను అందుబాటులో ఉంటాయని, భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆన్‌లైన్‌లో ముందస్తుగా దర్శన టికెట్లను బుక్ చేసుకోవాలని కోరుకోవాలని టీటీడీ పేర్కొంది. మరిన్ని వివరాల కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని కోరింది.కాగా వేసవిలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారి సౌకర్యార్థం జూన్ 30వ తేదీ వరకు అష్టదళపాద పద్మారాధన, తిరుప్పావడ సేవలను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ప్రతి మంగళవారం నిర్వహించే అష్టదళపాద పద్మారాధన సేవా టికెట్లను జూన్ వరకు ఆన్‌లైన్ విడుదల చేయడంతో భక్తులు బుక్ చేసుకున్నారు. అయితే ప్రస్తుతం సేవా టికెట్లు బుక్ చేసుకున్న వారిని అష్టదళ పాదపద్మారాధన సేవకు అనుమతించాలని టీటీడీ నిర్ణయించింది. అలాగే అడ్వాన్స్ బుకింగ్‌లో జూన్ 30 వరకు తిరుప్పావడ సేవా టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు ఆయా తేదీల్లో బ్రేక్ దర్శనం కల్పిస్తున్నామని, లేదంటే రీఫండ్ చేయనున్నట్లు టీటీడీ తెలిపింది. ఈ మేరకు టీటీడీ ఒక ప్రకటన విడుదల చేసింది.

## టమాటా ధరలపై ఏపీ ప్రభుత్వం

విజయవాడ, మే 20, (న్యూస్ పల్స్)వంటింట్లో టమాటా() మంట పెడుతోంది. ప్రతి వంటలో నిత్యావసరమైన టమాటా ధర విపరీతంగా పెరిగింది. బహిరంగ మార్కెట్లలో కేజీ టమాటా రూ.80 పలుకుతోంది. అడ్డూఅదుపు లేకుండా పెరుగుతున్న వీటి ధరలకు కళ్లెం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మార్కెటింగ్ శాఖ ద్వారా రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి శుక్రవారం నుంచి రైతుబజార్ల ద్వారా విక్రయించేందుకు ఏర్పాట్లుచేసింది. హైదరాబాద్(ఊఎటవతీజీఏజీట) తదితర ప్రాంతాల నుంచి దిగుమతులు తగ్గడం, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తుండడం ధరల పెరుగుదలకు కారణమవుతోందని విశ్లేషకులు అంటున్నారు. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే రైతు బజార్లతో ధర కిలోకు కనీసం రూ.10 తక్కువగా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. తెలంగాణ(ఎవశ్రీజీనిఱజీనిజీ)తో పాటు ఇతర ప్రాంతాల నుంచి మరో 40 టన్నుల దిగుమతికి ఏర్పాట్లుచేసింది. వీటిని ఉత్తరాంధ్రతో పాటు కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో రైతుబజార్ల ద్వారా విక్రయించనుంది. కిలో రూ.60కు మించకుండా అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టారు.మదనపల్లి వంటి టమాటా మార్కెట్లలో నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టింది.

# ఆ ధైర్యం చంద్రబాబుకి ఉందా?



తాడేపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి గతంలో మాట్లాడింది ఈరోజు గుర్తుండదని, రేపు ఏమి మాట్లాడతాడో ఎవరికీ తెలియదని కర్నూల్ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ విమర్శించారు. అధికారం లేకుంటే చంద్రబాబు బతకలేడని, అబద్ధాలు చెప్పకుంటే ఉండలేడని హాఫీజ్ ఖాన్ ధ్వజమెత్తారు. శుక్రవారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి మాట్లాడిన ఆయన..'మాకు గర్వంగా ఇంటింటికీ వెళ్ళే ధైర్యం ఉంది..చంద్రబాబుకి ఆ ధైర్యం ఉందా..?, రేపు మా మంత్రులు కూడా జిల్లాల పర్యటన చేసి ఎవరికేం చేశామో చెప్పే శక్తి మాకుంది. 14 ఏళ్ల ముఖ్యమంత్రి చంద్రబాబు అంతే ధైర్యంగా చేసింది ఏమైనా చెప్పగలడా...?, ఎక్కడా గెలవలేని పుత్రుడు, దత్తపుత్రుడితో అబద్ధాల ప్రచారం చేయిస్తున్నాడు. ఎక్కడా లేని సంక్షేమ ఫలాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. ఆ కడుపుమంట తట్టుకోలేక చంద్రబాబు ఇష్టారీతిన మాట్లాడుతున్నాడు. ఎప్పుడూ బీసీలను చంద్రబాబు కించపరిచాడు. సురేష్ ప్రభు, నిర్మలా సీతారామన్‌కి మీరు ఎలా సీటు ఇచ్చారు. టీజీ వెంకటేష్ వద్ద ఎంత తీసుకుని సీటు ఇచ్చావ్..?, సుజనా చౌదరి లాంటి వారు నీకు మేధావులా ..?, సామాజిక న్యాయం చేస్తుంటే చంద్రబాబుకి బాధ...అందుకే దుష్ప్రచారం' అని మండిపడ్డారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ఏపీలో ప్రజలు చారిత్రాత్మక తీర్పుతో జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకున్నారనే విషయం చంద్రబాబు తెలుసుకుంటే మంచిదని హాఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు.

# బీసీలకు అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వం

ఆలూరు  బీసీలను వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందని బిజెపి ఓ బి సి మోర్చ జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి ఆరోపించారు పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో జిల్లా అధ్యక్షుడు రామస్వామి అధ్యక్ష తన నిర్వహించిన నియోజకవర్గ మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు మూడేళ్ళ వైసిపి పాలనలో బీసీలు అన్ని విధాలుగా నష్టపోయారన్నారు రాష్ట్ర ప్రభుత్వం పబ్లిసిటీ చేసుకొని పబ్బం గడుపు కుంటుందని ఆరోపించారు కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కపిలేశ్వరయ్యా రాష్ట్ర కార్యదర్శి కూలిగిరి నీలకంఠ జాతీయ నాయకులు చిదానంద జిల్లా నాయకులు నవీన్ కిషోర్ రామకృష్ణ ఆలూరు తాలూకా ఇంచార్జ్ వెంకట్ రాముడు మహిళల మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాలతి శ్రీ పాల్గొన్నారు

# నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రత్యేక దాడులు నిర్వహించాలి

## వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వంగల భరత్ కుమార్ రెడ్డి

## జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్

నంద్యాల :-నకిలీ విత్తనాలకు నంద్యాల బ్రాండ్ గా పేరొస్తున్న ప్రమాదాన్ని గుర్తించి వ్యవసాయ అధికారులు అప్రమత్తమై నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రత్యేక దాడులు నిర్వహించి నంద్యాల జిల్లాను వ్యవసాయ జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగల భరత్ కుమార్ రెడ్డి సూచించారు. శుక్రవారం నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో వైఎస్సార్ సెంటినరీ హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మార్క్ ఫెడ్ చైర్పర్సన్ పి.పి. నాగిరెడ్డి, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, వ్యవసాయ మండలి సభ్యులు శివకుమారి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ముందస్తు సమాచారం ఇస్తూ మొక్కుబడి రీతిలో దాడులు నిర్వహించకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నకిలీ విత్తనాల విక్రయ దుకాణాల లైసెన్సులు రద్దు చేసి కేసులు నమోదు చేయాలన్నారు. అవసరమైతే విజిలెన్స్ సహకారం తీసుకుని రెండు నెలలపాటు దాడులు ముమ్మరం చేసి నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు ఇప్పటివరకు ఎన్ని షాపులు తనిఖీ చేశారు.ఎన్ని బృందాలు ఏర్పాటు చేశారు.తదితర వివరాలను ఇవ్వాల్సిందిగా జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. అలాగే రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు కూడా నకిలీ విక్రయాలు జరగకుండా అరికట్టాలన్నారు. నంద్యాల ప్రాంతంలో అన్ని రకాల నేలలు ఉన్నాయని. ఈ ఖరీఫ్ సీజన్లో రైతులు ప్రొద్దు తిరుగుడు, కుసుమ తదితర ఆయిల్ సీడ్ పంటలు వేసుకునేందుకు రైతు భరోసా కేంద్రాలకు లక్ష్యాన్ని నిర్దేశించి రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.సాఫ్ట్ వేర్ ఉద్యోగం కన్నా మంచి ఆదాయం వున్నా... అత్యంత లాభదాయకమైన పట్టు ఉత్పత్తి పంట కేవలం 3 నెలల సమయంలోనే దిగుబడి వస్తుందని పట్టు పంటలు వేసుకునేందుకు రైతులను ప్రోత్సహిస్తూ జిల్లాకు కేటాయించిన 350 ఎకరాలలో పట్టు ఉత్పత్తిని సాగు చేసి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిడి ని ఆయన సూచించారు. నంద్యాల ప్రాంతంలో నర్సరీలు అధికంగా ఉన్నాయని వాటికి సీడ్ ఇస్తున్న వివరాలు సేకరించడంతో పాటు నకిలీ విత్తనాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారిని సూచించారు. అలాగే బరక, బీడు భూముల్లో వెదురు ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో పశుసంపదను పోషించేందుకు మెట్ట నేలలు, అటవీ భూములు ఉన్నాయని... తొలకరిలకు రకరకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని పశుసంపదను చనిపోయే స్థితికి తీసుకురాకుండా సరైన సమయానికి వాక్సినేషన్ అందించాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగక ముందే రైతు సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను సూచించారు.జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల అంశాన్ని వ్యవసాయ అధికారులు సీరియస్ గా తీసుకుని అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు విక్రయిస్తే సంబంధిత దుకాణాలను సీజ్ చేయడంతోపాటు సంబంధిత వ్యక్తుల పై కేసులు నమోదు చేయాలన్నారు. మండల× స్థాయి బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ లు ఏర్పాటు చేయడంతోపాటు విస్తృతంగా దాడులు నిర్వహించాలన్నారు. వ్యవసాయ అధికారులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండి నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులు వేసుకున్న ప్రతి పంటను ఈ క్రాఫ్ బుకింగ్ చేయడంతోపాటు ఖరీఫ్ సీజన్లో అధిక దిగుబడులు సాధించే పంటలపై అవగాహన కల్పించాలన్నారు. సాగుకు ముందే నాణ్యమైన విత్తనాలు రసాయనిక ఎరువులు క్రిమిసంహారక మందులు రైతులకు పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.వ్యవసాయానికి సంబంధించి రైతులు లాభసాటి పంటలు వేసుకునే ప్రోత్సహించి సంబంధిత పంట ఉత్పాదకతలో శిక్షణనిచ్చి ప్రతి గ్రామంలోని రైతు భరోసా కేంద్రాలు వ్యవసాయ హబ్ గా ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలోని అన్ని సాగునీటి కాలువలకు జూలై మొదటి వారంలో నీటిని విడుదల చేసే అవకాశం ఉందని ఇందుకు సంబంధించి క్యాలెండర్ ను రూపొందించుకొని ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తామని కలెక్టర్ తెలిపారు.జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిందని... ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాలను రైతులలోకి తీసుకెళ్లి సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. రైతులు వేసిన పంటలు 100% కలర్ బుకింగ్ చేయాలన్నారు. అవుకు రిజర్వాయర్ పరిధిలోని పొలాలు నీటితో నిండి నిరుపయోగంగా ఉన్నాయని సంబంధిత రైతులకు చేపల ఉత్పత్తిపై అవగాహన కల్పించాలని మత్స్య శాఖ డిడిని ఆదేశించారు.నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచ బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో శాండీస్ ఆయిల్ ఉత్పాదకతకు అవకాశం ఉంటుందని ఈ మేరకు రైతుల ప్రోత్సహించాలని వ్యవసాయ



అధికారులను ఆదేశించారు. మత్స్య సంపద ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మినిస్ట్రీ ఏర్పాటు చేసిందని జిల్లాలోని రిజర్వాయర్లలో మత్స్యశాఖ ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ డీడీని ఆదేశించారు. వ్యవసాయ రంగాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రైతులకు అనేక సబ్సిడీలు మంజూరు చేస్తోందని వీటి వినియోగించుకునేందుకు సంబంధిత పథకాలపై రైతుల్లో అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను సూచించారు. నంద్యాల ప్రాంతంలో సారవంతమైన భూములు ఉన్నాయని ఈ ప్రాంతం నుండే మొక్కజొన్న, జొన్న పంటలు ఎగుమతి చేస్తున్నారన్నారు. విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా ముందుగానే స్టాక్ తెప్పించుకుని రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పెండింగ్లో ఉన్న విత్తన విక్రయ కేంద్రాలకు లైసెన్సులు జారీ చేయాలని ఎంపీ అధికారులను ఆదేశించారు.మార్క్ ఫెడ్ చైర్పర్సన్ పి.పి. నాగిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ యంత్ర పనిముట్లు గ్రూపులకు కాకుండా వ్యక్తిగత రైతులకే పంపిణీ చేసే విధంగా తీర్మానించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు.జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యపు ఉత్పత్తులను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు వేసిన పంటలకు ఈ క్రాఫ్ బుకింగ్, ఇన్సూరెన్స్ చేపట్టాలని వ్యవసాయ అధికారులను ఆమె ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్ రావు, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసులు రెడ్డి, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖలు,ఏపీఎంఐపీ, మార్కెటింగ్, ఏపీఎంఐపీ, తదితర శాఖల అధికారులు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.అనంతరం వైయస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ మొబైల్ వాహనాన్ని ప్రారంభించి సంబంధిత వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# 199 మందికి 398 ఎకరాలు పంపిణీ

## భూముల పట్టాలు పంపిణీ

## భూముల హక్కు పత్రాలు పంపిణీ చేసిన వైకాపా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేల్ ఆర్డిఓ ఆకుల వెంకటరమణబద్వేలు ఉదయం ప్రతినిధిగోపవరం మండలం పరిధిలోని గోపవరం కాలనీ 1 కాలనీ 2 వాసులకు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మరియు ఎమ్మెల్సీ చేతుల మీదుగా 199 మందికి ఒక్కొక్కరికి రెండు ఎకరాల చొప్పున పట్టాలు ఇచ్చారు మొత్తం 199 మందికి గాను 398 ఎకరాల భూమిని పేద ప్రజలకు అందజేశారు. గతంలో గోపవరం ప్రాజెక్టు సొసైటీ ఆధీనంలో ఉన్న భూమిని కౌలు కింద చేసుకునేవారు. ప్రస్తుతం ఆ భూముల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్లైవుడ్ కంపెనీ నిర్మించేందుకు ప్రభుత్వం కొంత భూమిని కేటాయించి ఈ మధ్యకాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఫ్యాక్టరీ నిర్మించేందుకు శంకుస్థాపన కూడా చేశారు. మిగిలిన భూములను గోపురం ప్రాజెక్ట్ కాలనీ ఒకటి గోపవరం ప్రాజెక్టు 2 కాలనీలలో నివాసం ఉంటున్న పేదలకు ఎమ్మెల్యే డాక్టర్ సుధ , ఎమ్మెల్సీ గోవింద్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సొసైటీ ఆధీనంలో ఉన్న భూములను కేవలము కవులకు మాత్రమే సాగు చేసుకున్న వారిని ప్రభుత్వం ఇప్పుడు పూర్తిగా పట్టా రూపంలో హక్కు కలిగించారని పేర్కొన్నారు. ఒకటిన్నర ఎకరా భూమి వ్యవసాయ గాను అర ఎకరా నివాసయోగ్య స్థలం గాను పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. అలాగే వారికి సెంచరీ ప్లైవుడ్ ఫ్యాక్టరీ లో కూడా ఉద్యోగాలు అవకాశాలు కల్పిస్తా మనీ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన భూమిని సద్వినియోగం చేసుకొని అందులో ఫ్యాక్టరీ ఉపయోగించే యూకలిప్టస్ చెట్లను నాటి లబ్ధి పొందాలని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి దృష్టిలో పెట్టుకొని సెంచరీ ప్లైవుడ్ కంపెనీ బద్వేల్ కు తెచ్చారని పేర్కొన్నారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణ ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ ఆకుల వెంకటరమణ ఎమ్మార్వో వెంకట రమణ మున్సిపల్ చైర్మన్ వా కమల రాజగోపాల్ రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రెడ్డి, గోపవరం మాజీ ఎంపీపి సరస్వతమ్మ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మల్లికార్జున్ రెడ్డి, లబ్ధిదారులు రెవెన్యూ సిబ్బంది, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేచురల్ స్టార్ నాని 'దసరా' స్టోరీ ఇదేనా?

ఇప్పుడు ఏ హీరోని కదిలించినా వినిపిస్తున్న మాట పాన్ ఇండియా. ప్రభాస్ నుంచి నిఖిల్ వరకు ఏ హీరోని కదిలించినా పాన్ ఇండియా సినిమా ముచ్చట్లే చెబుతున్నారు. పాన్ ఇండియా సినిమాలే చేస్తున్నారు. ఈ జాబితాలో నేచురల్ స్టార్ నాని కూడా చేరుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది రెండు చిత్రాలతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. అందులో ఒకటి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ 'టక్ జగదీష్'. శివ నిర్వాణ డైరెక్ట్ చేసిన ఈ మూవీ డైరెక్ట్ గా ఓటీటీలోనే విడుదలై ఫరవాలేదనిపించింది.ఇక యంగ్ డైరెక్టర్ రాహుల్ సంక్రీత్యన్ డైరెక్షన్ లో చేసిన మరో మూవీ 'శ్యామ్ సింగరాయ్'. పీరియిడిక్ స్టోరీకి ప్రస్తుత



కథకు లింకప్ చేస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సాయి పల్లవి కృతిశెట్టి హీరోయిన్ లుగా నటించిన ఈ చిత్రం గత ఏడాది డిసెంబర్ లో విడుదలై మంచి విజయాన్ని సాధించింది. ఈ ఏడాది నేచురల్ స్టార్ నాని రెండు చిత్రాలతో ప్రేక్షకుల్ని పలకరించబోతున్నాడు.అందులో ఒకటి పాన్ ఇండియా మూవీ కావడం విశేషం. 'అంటే సుందరానికి' మూడు భాషల్లో మాత్రమే విడుదల కానుండగా మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా చేస్తున్న 'దసరా' ఐదు భాషల్లో పాన్ ఇండియా వైడ్ గా విడుదల కాబోతోంది.ఎస్ ఎల్ వీ సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో కీర్తి సురేష్ నానికి జోడీగా నటిస్తున్న విషయం తెలిసిందే. గత దసరా సందర్భంగా ఫస్ట్ లుక్ టైటిల్ మోషన్ పోస్టర్ ని విడుదల చేసిన తాజాగా ఫస్ట్ లుక్ ని విడుదల చేసిన చిత్ర బృందం ఈ సినిమా షూటింగ్ ని సింగరేణి కాలరీస్ లో జరుపుతోంది. ఇటీవల కొంత మేర ఒరిజినల్ సింగరేని కాలరీస్ లో జరిపిన టీమ్ అక్కడి హీట్ కు చిత్ర బృందం ఇబబ్ందులు ఎదుర్కొన్న నేపథ్యంలో హైదరాబాద్ శివార్లతో ఏకంగా సింగరేణి కాలరీస్ సెట్ ని క్రియేట్ చేసి అందులో షూటింగ్ చేస్తున్నారు. ఈ చిత్రంలో హీరో నాని తన గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఊర మాస్ పాత్రలో కనిపించబోతున్నాడు. సినిమాలో నాని పాత్ర పేరు ధరణి. డీ గ్లామర్ పాత్రలో కనిపించనున్న నాని లుక్ ఇప్పటికే సినిమాపై అంచనాల్ని పెంచేసింది. గోదావరిఖని సింగరేణి కాలరీస్ నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇదిలా వుంటే ఈ చిత్ర కథ ఇదే అంటూ ఓ వార్త తాజాగా బయటికి వచ్చింది. సింగేణి ఓపెన్ కాస్ట్ కారణంగా చాలా వరకు గ్రామాలు తమ భూమిని ఇళ్ల స్థలాలని పోగొట్టుకున్నాయి.సెంట్రల్ గవర్నమెంట్ కి సంబంధించిన అంశం కావడంతో తాము పోగొట్టుకున్న భూమికి నష్టపరిహారం చెల్లించాలంటూ చాలా గ్రామాలు పోరాటం చేశాయి. అదే అంశం నేపథ్యంలో 'దసరా' కథ వుంటుందని ఓపెన్ కాస్ట్ కారణంగా విలువైన భూముల్ని పోగొట్టుకుని రోడ్డున పడ్డ కొంత మంది కోసం ఫైట్ చేసే యువకుడి కథగా ఈ సినిమా వుంటుదని ఫిల్మ్ సర్కిల్స్ లో వినిపిస్తోంది. ఇటీవల విడుదలైన 'స్పార్క్ ఆఫ్ దసరా' వీడియోలో కొంత మంది తన వెంట రాగా నాని 90 ఎం.ఎల్ బాటిల్స్ లింగీకి కట్టుకుని ఊర మాస్ గా కనిపిస్తూ రగులుతున్న బొగ్గులో బీడీని వెలిగించుకుంటూ కనిపించిన వీడియో ఇదే అంశాన్ని స్పష్టం చేస్తున్నట్టుగా వుందని వార్తలు వినిపిస్తున్నాయి.

# లైఫ్ జాకెట్ లో రకుల్.. అడ్వెంచర్ ఎక్కడో మరి?

ఢిల్లీ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ మంచి ప్రకృతి ప్రేమికురాలు. ఖాళీ సమయం దొరికితే నేచురల్ అందాల్లో మమేకమైపోతుంది. నేచర్ పై పరిశోధన సైతం ఎంతో ఇష్టం అంటుంది. ఇక సాహస యాత్రలంటే ఇంకా ఇష్టం. ఒంటరిగా బేర్ గ్రిల్స్ లాంటి సాహసాలు చేయాలని ఉంటుంది. కానీ తాను నటి అయింది కాబట్టి ఆ స్కోప్ లేదు. అవును ఈ విషయాన్ని రకుల్ ఓ పాత ఇంటర్వ్యూ సందర్భంలో వెల్లడించింది.అప్పుడప్పుడు తన కోర్కెల్ని సినిమా లో తన పాత్రల రూపంలో దక్కితే ఎంతో సంతోష పడుతుంది. మరెంతో ఇష్టంగా నటించడానికి రెడీగా ఉంటుంది. కొండపొలం లాంటి సినిమాతో పచ్చనైన ప్రకృతి అందాల్ని ఎంతగా ఆస్వాదించిందో ఆ సినిమా ప్రమోషన్ టైమ్ లో చెప్పుకొచ్చింది. తాజాగా అమ్మడు అడ్వెంచర్ ట్రిప్ కి సంబంధించిన ఫోటో ఒకటి వైరల్ గా మారింది. అందులో రకుల్ ఆరెంజ్ కలర్ టీషర్ట్ పై బ్లూ కలర్ లైఫ్ జాకెట్ ధరించి కనిపిస్తుంది.క్యాజువల్ చుక్కల ప్యాంట్ లో కనిపిస్తుంది. అలాగే ఎండ తీవ్రతని తట్టుకునేలా కళ్లకి కూలింగ్ గ్లాసెస్...తలకి టోపీ పెట్టుకుని స్పాట్ నుంచి కొన్ని ఫోటోల్ని లిక్ చేసింది. మరి ఈ లొకేషన్ ఎక్కడ? అన్నది తెలియదు గానీ...రకుల్ మాత్రం అడ్వెంచర్ ట్రిప్ ని బాగా ఆస్వాదిస్తుంది. బ్యాక్ గ్రౌండ్ లో పెద్ద పెద్ద బండరాయి కొండలా కనిపిస్తుంది. మరి ఆ కొండ మీద నుంచి కిందకి దూకి ఇలా ఫోజిచ్చిందా? ఏంటో? మరి. ఏదేమైనా రకుల్ కొత్త ఫోటో ఫాలోవర్లకి బ్రేకిచ్చినట్లు అయింది.వరుసగా హాట్ ఫోటోలు చూసి బోర్ కొట్టిన జనాలకి ఇది విరామం లాంటి పిక్. రెగ్యులర్ చిత్రాలకు భిన్నంగా కనిపిస్తున్న ఫోటో కావడంతో రకుల్ సాహస యాత్ర కోసం ఎక్కడికి వెళ్లిందంటూ ప్రశ్నిస్తున్నారు. మరి ఆ సంగేతంటి? అన్నది రకుల్ రివీల్ చేస్తే గాని క్లారిటీ రాదు. ఇక రకుల్ సినిమాల విషయానికి వస్తే బాలీవుడ్ లో నటిగా బిజీగా ఉంది. 'డాక్టర్ జీ' అనే సినిమాలో నటిస్తోంది. చిత్రీకరణ పూర్తయింది. త్వరలోనే రిలీజ్ కానుంది. అలాగే 'ఛత్రవాలీ' అనే మరో సినిమాలో కూడా నటిస్తోంది. ఇది షూటింగ్ దశలో ఉంది. 'ఎటాక్'..'రన్ వే'..'థాంక్ గాడ్'..'మిషన్ సింద్రాల్లా నటిస్తోంది'. వీటిలో కొన్ని చిత్రాలు షూటింగ్ పూర్తిచేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్నాయి.ఇక కోలీవుడ్ లో శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'ఇండియన్ -2'లో నటిస్తోంది. ఈ సినిమాపై రకుల్ చాలా ఆశలు పెట్టుకుంది. తెలుగులో '31 అక్టోబర్ లేడీస నైట్' లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని తెలుగు..తమిళ్ లో తెరకెక్కిస్తున్నారు.

# సెంటిమెంట్ అంటూ బన్నీ - సుక్కు రిస్క్ చేస్తారా?

ఓ నెలలో సినిమా విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ ని అందిస్తే అదే సెంటిమెంట్ గా భావిస్తుంటారు సినిమా స్టార్స్. ప్రతీ హీరోకు ఓ సెంటిమెంట్ నెల అంటూ వుంటుంది. అది దక్షిణాది స్టార్ అయినా ఉత్తరాది స్టార్ అయినా ఆ సెంటిమెంట్ కే పెద్ద పీట వేస్తుంటారు. సల్మాన్ ఖాన్ కి ఈద్ సెంటిమెంట్. ఆ టైమ్ లో సినిమా రిలీజ్ చేస్తే బ్లాక్ బస్టర్ గ్యారెంటీ అని అతని నమ్మకం. ఇక మన హీరోల్లో కొంత మందికి సంక్రాంతి సెంటిమెంట్ అయితే కొంత మందికి సమ్మర్ సెంటిమెంట్.ఇలా తమ సినిమాలని సెంటిమెంట్ టైమ్ లోనే రిలీజ్ చేస్తూ వుంటారు. బన్నీకి కూడా ఈ మధ్య ఓ సెంటిమెంట్ నెలపై మనసు పడుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. ఐకాన్ స్టార్ బన్నీ నటించిన పాన్ ఇండియా మూవీ 'పుష్ప'. స్టార్ డైరెక్టర్ సుకుమార్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం గత ఏడాది డిసెంబర్ లో విడుదలై సంచలన విజయాన్ని సాధించింది. అంతే కాకుండా బాలీవుడ్ లో రికార్డుల మోత మోగించింది. బన్నీని మొత్తానికి పాన్ ఇండియా స్టార్ గా



నిలబెట్టింది.ఇన్ని చేసిన డిసెంబర్ నెల ఇప్పుడు బన్నీకి సెంటిమెంట్ గా మారిందట. త్వరలో బన్నీ 'పుష్ప 2'షూటింగ్ ని మొదలు పెట్టబోతున్న విషయం తెలిసిందే. జూలై నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ని స్టార్ట్ చేయాలనుకుంటున్నారట. ఫస్ట్ పార్ట్ కి లభించిన ఆదరణని దృష్టిలో పెట్టుకుని 'పుష్ప 2' స్క్రిప్ట్ లో భారీ మార్పులు చేశారట సుకుమార్. బడ్జెట్ ని కూడా ముందు అనుకున్న దాని కంటే భారీగా పెంచేసి 375 కోట్లు ఖర్చు చేయబోతున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి.అయితే ఈ మూవీని ఫస్ట్ పార్ట్ ల హరీ బరీగా విడుదల చేయాలనుకోవడం లేదట. ప్రాపర్ గా ఐదు భాషల్లో ప్రమోషన్స్ భారీ స్థాయిలో నిర్వహించిన తరువాతే 'పుష్ప2'ని రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అంతే కాకుండా జూలైలో షూటింగ్ మొదలు పెట్టి జనవరి వరకు కంప్లీట్ చేసినా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల కోసం భారీగానే టైమ్ తీసుకోవాలనుకుంటున్నారట. ఇక తమకు అచ్చొచ్చిన డిసెంబర్ లోనే సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారట.మరీ ఇంత ఆలస్యం అయితే ఇబ్బంది కదా? అని అంటే సెంటిమెంట్ నెలలోనే 'పుష్ప 2'ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని బన్నీ సుక్కు బలంగా భావిస్తున్నారని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే ఇది రిస్క్ కదా?. సినిమాని పూర్తి చేసి అన్ని నెలలు రిలీజ్ కోసం ఎదురుచూడటంతో ఈ విషయం తెలిసిన వాళ్లంతా మరీ ఇంత ఆలస్యంగా సినిమాని థియేటర్లలోకి తీసుకురావాలనుకోవడం రిస్క్ కదా? అని కామెంట్ లు చేస్తున్నారు. మరి ఇది ఎంత వరకు నిజమన్నది తెలియాలంటే అధికారికంగా చిత్ర బృందం ప్రకటించే వరకు వేచి చూడాల్సిందే.

# వాళ్లిద్దరు తుది జట్టులో ఉంటే టీమిండియాదే డబ్ల్యూటీసీ టైటిల్: సెహ్వాగ్

టీమిండియా యువ ఆటగాళ్లు రిషభ్ పంత్, పృథ్వీ షా టెస్టు జట్టులో ఉంటే తిరుగే ఉండదని భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. విధ్వంసకర ఆట తీరుతో విరుచుకుపడే ఈ యువ కెరటాలు కలిసి ఆడితే టీమిండియా టెస్టు క్రికెట్‌ను ఏలడం ఖాయమని పేర్కొన్నాడు. కాగా వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ ఇప్పటికే టెస్టుల్లో తన మార్కు చూపిస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు.. పృథ్వీ షా సైతం వెస్టిండీస్‌తో అరంగేట్ర



మ్యాచ్‌లోనే అదరగొట్టే ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇక అతడు చివరిసారిగా ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఈ నేపథ్యంలో స్పోర్ట్స్ 18 షో హోమ్ ఆఫ్ హీరోస్‌లో సెహ్వాగ్ మాట్లాడుతూ వీరిద్దరి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "పృథ్వీ షా.. టెస్టు క్రికెట్‌లో అసలైన మజా అందించగలడు. షా, పంత్ జట్టులో ఉంటే ప్రత్యర్థి జట్టు కనీసం 400 స్కోరు చేయాల్సి ఉంటుంది. వీళ్లిద్దరూ తుది జట్టులో ఉంటే టీమిండియా టెస్టు క్రికెట్‌ను శాసించగలదు. కచ్చితంగా వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) గెలుస్తుంది కూడా" అని ప్రశంసలు కురిపించాడు.ఇక రిషభ్ పంత్‌ను ఓపెనర్‌గా దించితే అతడు మరింత గొప్పగా రాణించే అవకాశం ఉందని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. కాగా అండర్-19 వరల్డ్‌కప్ సమయంలో పంత్ ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. ఐపీఎల్‌లోనూ కొన్నాళ్ల పాటు ఓపెనింగ్ చేసిన సంగతి తెలిసిందే. ఇక ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు పంత్ సారథ్యం వహిస్తుండగా... పృథ్వీ షా ఓపెనర్‌గా ఉండటం విశేషం.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190